RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


సంపుటి : 2 సంచిక : 232 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 సెప్టెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్

చెన్నై :పెట్రోల్, డీజిల్‌ను జీఎసటీ పరిధిలోకి తీసుకురావాలన్న అభ్యర్థనపై ఏం చెబుతారని కేంద్రప్ర భుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించిం ది. ఈ వ్యవహారంలో సాధ్యాసాధ్యాలపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పెట్రోల్, డీజిల్‌ను కూడా జీఎసటీ పరిధిలోకి తీసుకొచ్చి, దేశవ్యాప్తంగా ఒకే రకమైన ధరకు విక్రయించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ సీనియర్ న్యాయవాది కనకరాజ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

# అస్తమించిన వామపక్ష యోధుడు

## తుదిశ్వాస విడిచిన సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి




ప్రముఖ రాజకీయవేత్త, వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో దిల్లీ ఎయిమ్స్‌లో కొద్ది వారాలుగా చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందిన ఏచూరి.. 1992 నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు.

**బాల్యం హైదరాబాద్‌లోనే..** సీతారాం ఏచూరి మద్రాస్ (ప్రస్తుతం చెన్నై)లో తెలుగు కుటుంబంలో 12 ఆగస్టు 1952న జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్‌లో ఇంజినీర్. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారి. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ మోహన్ కందాకు మేనల్లుడు. ఏచూరి బాల్యం హైదరాబాద్‌లోనే గడిచింది. ఇక్కడి ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం దిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో చేరారు. 1970లో సీబీఎస్‌సీ హయ్యర్ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. ప్రఖ్యాత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అక్కడే పీహెచ్‌డీలో చేరినా.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు కావడంతో దాన్ని కొనసాగించలేకపోయారు. సీతారాం మొదటి భార్య ఇంద్రాణి మజుందార్. జర్నలిస్టు సీమా చిశ్తీని రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం.

**విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి..** ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు సీపీఎంలో చేరారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయిన వారిలో ఆయన కూడా ఒకరు. జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్ష కోటగా మార్చారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1992లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటినుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు.

**ప్రజాసమస్యలపై గళం విప్పుతూ..** ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. ఎగువ సభలో సీతారాం ఏచూరి గుర్తింపు పొందారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరంతోపాటు ఏచూరి కీలకంగా వ్యవహరించారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణంలోనూ ముఖ్య భూమిక పోషించారు. రచయితగానూ మంచి గుర్తింపు ఉంది.

'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరిట ఓ ఆంగ్లపత్రికకు కాలమ్స్ రాశారు. 'క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే', 'సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్', 'మోదీ గవర్నమెంట్: న్యూ సర్జ్ ఆఫ్ కమ్యూనలిజం', 'కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం' వంటి పుస్తకాలు రాశారు.



## ఖైరతాబాద్‌లోని సప్తముఖ మహాశక్తి గణపతిని దర్శించుకున్న వెంకయ్య నాయుడు

హైదరాబాద్: ఖైరతాబాద్‌లోని సప్తముఖ మహాశక్తి గణపతిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలందరిపై గణేశుడి ఆశీస్సులు ఉండాలన్నారు.

# మెడికల్ అడ్మిషన్లకు స్థానికతపై సుప్రీంకు తెలంగాణ సర్కార్





ఢిల్లీ, సెప్టెంబర్ 12: మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించ రాదని హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది.

**తెలంగాణ హైకోర్టు తీర్పిదే...** కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియ డంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. "ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం" అని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ప్రభుత్వం సవరణ ద్వారా తీసుకొచ్చిన రూల్ 3(ఏ) ముఖ్యఉద్దేశం స్థానికులకు రిజర్వేషన్ కల్పించడం. ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది. అందుకే.. ఈ నిబంధనను పునర్నిర్వచిస్తున్నాం. తెలంగాణ శాశ్వత నివాసులకు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వర్తించదని అన్వయిస్తున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డీ(2), బీ(2)లో పేర్కొన్న ముఖ్య ఉద్దేశానికి అనుగుణంగానే.. ప్రభుత్వం తెచ్చిన నిబంధన 3(ఏ)ని నిర్వచిస్తున్నాం" అని వ్యాఖ్యానించింది. నీట్ విద్యార్థులు తెలంగాణలో శాశ్వత నివాసితులు అయితే.. ఆ మేరకు నివాస ధ్రువీకరణ పత్రాలుంటే.. వారు వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానిక కోటాకు అర్హులేనని స్పష్టం చేసింది. శాశ్వత నివాసితులను గుర్తించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకాలు లేవని గుర్తుచేసింది. ఒక విద్యార్థిని ఏయే పరిస్థితుల్లో శాశ్వత స్థానికుడిగా పరిగణనలోకి తీసుకుంటారనే అంశాన్ని నిర్వచిస్తూ.. కొత్తగా నిబంధనలు లేదా మార్గదర్శకాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త మార్గదర్శకాల మేరకు ప్రవేశాలు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.




# పంతం నెగ్గేనా!?

## తెలంగాణ కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## రేవంత్ అనుకున్న వారికే పదవులు ఇవ్వగలరా !!?

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధాన లక్ష్యం.. కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ తెచ్చుకోవడం. ఇందు కోసంఆయన చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అధికారం లోకి వచ్చి పది నెలలు అవుతోంది. పాలన గాడిలో పెట్టుకుంటున్నారు. ఈ సమయంలో కీలకమైన హెూం, విద్య వంటి శాఖలకు పూర్తి స్థాయి మంత్రులు లేరు. విధేయులకు ఆ పదవులు కట్టబెట్టి మరింత దూకుడుగా వెళ్లాలని రేవంత్ అనుకుంటున్నారు. కానీ సీనియర్లు రకరకాల కాంబినేషన్లతో తెర ముందుకు వస్తూండటంతో.. హైకమాండ్ ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తోంది.

**కేబినెట్లో ఆరు మంత్రి పదవులు ఖాళీ :** తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో కలిపి పన్నెండు మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరు కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఆశావహులు ఉత్సాహంగా పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయడానికి చూపించడానికి ఖాళీగా ఉంచారు. అందరికీ టార్గెట్లు పెట్టి ఎన్నికల్లో పని చేయించుకున్నారు. వారంతా ఇప్పుడు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆరు స్థానాల్లో భర్తీ చేస్తే.. ఇక పదువులు రావని అసంతృప్తి చెందే వారు ఉంటారు. అందుకే.. ఒకటి, రెండు ఖాళీగా ఉంచి కనీసం నాలుగు మంత్రి పదవుల్నైనా భర్తీ చేయాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. ఇదే టార్గెట్ తో ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**రేసులో పలువురు సీనియర్లు :** క్యాబినెట్ విస్తరణలో తమకు చోటు దక్కుతుందని పలువురు సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్, వినోద్ తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. దళిత కోటాలో వీరిద్దరిలో ఒకరికి అచేచ అవకాశం ఉందని చెబుతున్నారు. మంచిర్యాల నుంచి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తమ సీనియార్టీని గుర్తిస్తారని ఎదురు చూస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి ..తమ తమ జిల్లాల్లో తామే ఉండటాన్ని ప్లస్ పాయింట్ గా ఎంచుకుంటున్నారు. వీరితో పాటు నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అజారుద్దీన్ మంత్రి పదవుల కోసం.. హైకమాండ్ వద్ద తమ పలుకుబడిని ఉపయోగించుకుంటున్నారు. ఎవరికి చాన్స్ వస్తుందా అన్నది సస్పెన్స్ గానే ఉంది.

**రేవంత్ లిస్ట్ వేరే :** రేవంత్ రెడ్డి తనకు విధేయులుగా ఉండేవారిని.. పాలనలో తన వేగాన్ని అందుకునే వారిని.. సామాజిక సమీకరణాల్ని చూసుకుని కొన్ని పేర్లు రెడీ చేసుకున్నారు.

గతంలోనే ఆయన ఆ జాబితా సమర్పించారు. కానీ ఇతర సీనియర్ నేతల అభ్యంతరాలతో గ్రీన్ సిగ్నల్ రాలేదు. గతంలో ఆగిపోయినా.. తాను అనుకున్నట్లుగానే మహేష్ కుమార్ గౌడ్ కు పీసీసీ చీఫ్ పదవి ఇప్పించుకున్నట్లుగానే మంత్రి పదవుల విషయంలోనూ తాను అనుకున్న వారికే ప్రాధాన్యత ఇచ్చేలా హైకమాండ్ ను ఒప్పించాలని రేవంత్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

# సంపాదకీయం

## భారత్ లోనే ఎక్కువ ఆత్మహత్యలు.. ఎందుకో తెలుసా?

చిన్న చిన్న కారణాలకు, వైఫల్యాలకు ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య పెరిగిపోయింది. ఆత్మహత్యను మహా పాపంగా ఆయా మతాలు పేర్కొంటున్నాయి. నిపుణులు, సైకాలజిస్టులు ఆత్మహత్యల నివారణపై పెద్ద ఎత్తున కౌన్సెలింగ్ ఇస్తున్నారు.. అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో ఆత్మహత్యల నివారణకు కౌన్సెలింగ్ సెషన్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంగా సందర్భంగా నిపుణులు బాంబు పేల్చారు. ప్రపంచంలో ఇతర దేశాల కంటే భారత్ లోనే ఆత్మహత్యలు ఎక్కువని తేల్చారు. ఆత్మహత్యల నివారణపై అవగాహన పెంచడానికి, వీటిపై పోరాడటానికి ఏటా సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 'ఆత్మహత్యలపై దృక్పథాన్ని మార్చడం'ను థీమ్‌గా తీసుకున్నారు. భారతదేశంలో 15%-%19 సంవత్సరాల మధ్య వారి మరణాల్లో ఆత్మహత్య నాలుగోదిగా నిలుస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం.. ఆత్మహత్యలకు పాల్పడే కేసుల్లో 40 శాతానికి పైగా 30 ఏళ్లలోపు యువకులే కావడం గమనార్హం. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం .. 2022లో 1.71 లక్షల మంది మనదేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇవి లెక్కతేలినవి మాత్రమే. ఇంకా లెక్కలోనికి రానివి చాలా ఉన్నాయంటున్నారు. భారతదేశంలో ఆత్మహత్యల ద్వారా మరణించే యువకుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఎయిమ్స్ ఢిల్లీలోని సైకియాట్రీ ప్రొఫెసర్ నందకుమార్ వెల్లడించారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్ లో ఆత్మహత్య చేసుకున్న యువకుల సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉండటం సర్వత్రా ఆందోళన రేపుతోందన్నారు. భారతదేశంలో రోజుకు సుమారు 160 మంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన బాంబుపేల్చారు. ఒత్తిడితో కూడిన కుటుంబ వాతావరణాలు, అస్థిర, నిలకడ లేని భావోద్వేగాలు, మత్తు పదార్థాల వినియోగం, లవ్ ఫెయిల్యూర్స్, స్నేహితుల మధ్య బలహీనమైన బంధం, ఒంటరితనం ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. 15 నుండి 39 సంవత్సరాల వయస్సు గల వ్యక్తుల్లో మరణానికి ఆత్మహత్య ప్రధాన కారణంగా నిలుస్తోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా, మన దేశంలో మనం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సంక్షోభాలలో ఒకటి.. ఆత్మహత్య అని అని లైవ్ లవ్ లాఫ్ సంస్థ సైకియాట్రిస్ట్, ఆ సంస్థ చైర్‌పర్సన్ అయిన డాక్టర్ శ్యామ్ భట్ తెలిపారు. మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి, ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వం నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్, కిరణ్ హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాలను ప్రారంభించింది. అయితే, ఆత్మహత్యల రేటును తగ్గించడానికి ఎక్కువ అవగాహన, సంరక్షణ కల్పించడం, అంతర్లీనంగా ఉన్న సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించడం చాలా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మానసిక ఆరోగ్యాలను నయం చేయాల్సి ఉంటుందంటున్నారు. మానసిక సవాళ్లతో పోరాడుతున్నవారికి సహాయం చేయడం, వారి పట్ల దయతో వ్యవహరించడం అవసరమని చెబుతున్నారు. ఇది సమాజం బాధ్యత కావాలంటున్నారు.

# దేవాదాయ శాఖలో బదిలీల ఉత్కంఠ



కరీంనగర్ : దేవాదాయ శాఖలో బదిలీల ఉత్కంఠ నెలకొంది. జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి కొన్ని ఆలయాలను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో రావాలని ఉన్నతాధికారుల నుంచి పిలుపు రావడంతో దేవాదాయ శాఖ కార్య నిర్వహణాధికారులు సోమవారం హైదరాబాద్‌కు వెళ్లారు. దశాబ్దకాలంగా ఒకే చోట పని చేస్తున్న కొందరు ఉద్యోగులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నాయి. మొదట రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఉద్యోగులతోపాటు అర్చకులకు కూడా బదిలీ చేయాలని భావించింది. వారి నుంచి వ్యతిరేకత రావడంతో ఆ అంశాన్ని పక్కన పెట్టింది. ఉమ్మడి జిల్లా ఆలయాలన్నీ సహాయ కమిషనర్ పరిధిలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం కాలపరిమితి ముగియడంతో ఆ పోస్టు అధికారి బదిలీ తప్పదని తెలుస్తోంది. సహాయ కమిషనర్ కూడా బదిలీకి అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎవరు వస్తారనేది ఉత్కంఠగా మారింది. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసి పక్క జిల్లాలో ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్‌గా పని చేస్తున్న వారికి లేదా గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్‌గా పనిచేసిన అధికారుల్లో ఎవరో ఒకరికి ఆ స్థానం దక్కే అవకాశముంది. ప్రస్తుత సహాయ కమిషనర్ కొండగట్టు దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవోగా పని చేస్తున్నారు. అయితే కొండగట్టుకు హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో పని చేస్తున్న ఒక అధికారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

**ఇబ్బందులు తొలగేనా?**

ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీలు చేపట్టే విధంగా ఉద్యోగుల దరఖాస్తులు స్వీకరించారు. మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న ఉద్యోగులు వారికి అనువైన ప్రాంతాలు దక్కేనా అని ఎదురు చూస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి చేయడంతో అక్రమాలు వెలుగుచూస్తున్నాయనే అభిప్రాయాలున్నాయి. మార్పులు చేర్పులు జరిగితేనే వీటికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. మారుమూల, అటవీ ప్రాంతాల వారు బదిలీ అయ్యేందుకు ఇష్టపడుతున్నారు. 6ఏ, 6బి, 6సి (పెద్దవి) దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు అదే స్థాయి దేవాలయాలకు వెళ్లనున్నారు. మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మంది బదిలీ అయ్యే అవకాశముంది. మన జిల్లాలో ఈవోలు నలుగురు, మిగతా క్లారికల్ క్యాడర్‌లో దాదాపు 60 మందిలో 25 మందికి స్థానచలనం జరిగే అవకాశముంది.

**పదోన్నతులకు ఎదురుచూపులు..**

జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సిబ్బంది పదోన్నతులపై ఆశలు పెట్టుకున్నారు. వారు కొన్నేళ్లుగా అదే క్యాడర్‌లో పని చేయాల్సి వస్తోంది. కొంతమందికి పదవీ విరమణ వయసు దగ్గర పడటంతో ఈసారైనా పదోన్నతులు వచ్చేనా? అని ఎదురుచూస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే 5 నుంచి 10 దేవాలయాలకు ఇన్‌ఛార్జులుగా పని చేస్తున్న వారికి పనిభారమూ తగ్గుతుంది. పదోన్నతులు ఇస్తే గ్రేడ్-3 స్థాయి ఈవోలుగా నియామకం కానున్నారు.

**ఉద్యోగుల సమాచారం పంపాం**

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొత్తం రాష్ట్ర దేవాదాయ కమిషనర్ పరిధిలో ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్త ఉద్యోగుల సమాచారం పైకి పంపాం. అక్కడ ఉద్యోగుల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. మంగళవారం ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది.
– ఆకునూరి చంద్రశేఖర్, సహాయ కమిషనర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

**దశాబ్ద కాలంగా నిరీక్షణ**కొందరు ఉద్యోగులు దశాబ్ద కాలంగా బదిలీ కోసం ఎదురుచూ స్తున్నారు. ఏళ్ల తరబడి ఒకే ఆలయాల్లో ఉండటంతో కొందరికి మేలు జరిగింది. మరికొందరు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దేవాలయాల్లో కొంత మార్పు తీసుకురావాలని ప్రభుత్వం బదిలీలకు శ్రీకారం చుట్టింది.– ఎ.ప్రభాకర్, అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా అర్చక, ఉద్యోగ సంఘం

# మైనర్ల వేగం.. తల్లిదండ్రులకు శోకం



కరీంనగర్ : ఒడిశాకు చెందిన ఓ కార్మికుడు జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో సహా అయిదేళ్ల కిందట కరీంనగర్‌కు వచ్చారు. ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిరపడ్డారు. నెల రోజుల కిందట ఆయన కుమారుడు (పదహారు ఏళ్లు) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో రాత్రివేళ నగర శివారుకు వెళ్లాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉజ్వలపార్క్ వద్దనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని ఓ విద్యార్థి ఇంట్లో ఎవరికీ తెలియకుండా కారు బయటకు తీసుకెళ్లాడు. వాహన వేగాన్ని అదుపు చేయకపోవడంతో రోడ్డు పక్కన పని చేసుకుంటున్న వారిపై కారు దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థి తండ్రితోపాటు కారులో ప్రయాణించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పద్దెనిమిదేళ్లలోపే చాలామంది విద్యార్థులు ద్విచక్రవాహనాలు, కార్లు నడపాలని ఉత్సాహపడుతుంటారు. అది కాస్త ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. 8వ తరగతి చదువుతున్న చాలామంది విద్యార్థులు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ ఏడాది కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇప్పటివరకు 70కి పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.

పర్యవేక్షణ లోపం..

వాహనం నడపాలంటే 18 ఏళ్లు నిండటమే కాకుండా రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇవేమి పట్టకుండా కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇష్టానుసారంగా నడుపుతూ.. ప్రమాదం జరిగితే వాహనాన్ని అక్కడే వదిలేసి జారుకుంటున్నారు. వాహన వినియోగంపై సరైన అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇవీ నిబంధనలు..రవాణా శాఖ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు మాత్రమే వాహనం నడిపేందుకు అర్హులు.మైనర్లు వాహనం నడిపినా, ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు కుటుంబ పెద్దలను బాధ్యులుగా చేస్తూ వారిపై కేసు నమోదు చేస్తారు. రూ.1500 జరిమానా విధిస్తారు.

కేసును బట్టి తల్లిదండ్రులు, వాహన యజమానులకు 21 రోజుల జైలు శిక్ష.. రూ.5 నుంచి రూ.25 వేల జరిమానా వేస్తారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త రవాణా చట్టం ప్రకారం.. మైనర్లు జువైనల్ హోంకు వెళ్లే అవకాశముంది. మైనర్లు వాహనం పడిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే.. అతని వయసు, ప్రవర్తన బట్టి కేసును క్రిమినల్ కోర్టుకు బదిలీ చేస్తారు.కేసులు మరింత కఠినం..మైనర్ డ్రైవింగ్‌పై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మొదటిసారి పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. రెండోసారి మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.– జి.నరేందర్, ఏసీపీ కరీంనగర్ టౌన్

# చెరువెంత..? చెరలో ఉన్నదెంత..?



రాజధానిలో చెరువుల వారీగా ఆక్రమణల చిట్టాను వెలికి తీసే పనిలో హైడ్రా నిమగ్నమైంది. హైడ్రా పూర్తిస్థాయిలో ఏర్పాటవడానికి మరో నెల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ లోపు మహానగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లోని చెరువుల పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో ఆరాతీస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులు సేకరించి ఒక్కో చెరువు వారీగా ఎంత భూమి ఆక్రమణకు గురైందన్న దానిపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. అనంతరం ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ రూపొందించనున్నారు. **కేవలం 212 చెరువులకు మాత్రమే..**

బల్దియా, హెచ్‌ఎండీఏ పరిధిలోని 3,689 చెరువులన్నింటికి ఎఫ్‌టీఎల్ గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వమని రెండేళ్ల కిందట గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ఇప్పటివరకు 2,375 చెరువులకు మాత్రమే డ్రాఫ్టు నోటిఫికేషన్‌ను ఇచ్చారు. పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ ఇచ్చింది కేవలం 212 చెరువులకు మాత్రమే. నగరపరిధిలో 185 ప్రధాన చెరువులుంటే వాటిలో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది కేవలం 27 చెరువులకు మాత్రమే. ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో వెయ్యి ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని, వేల సంఖ్యలో నిర్మాణాలున్నాయని అధికారులు చెబుతున్నారు. **పూర్తిస్థాయి సిబ్బంది నియామకం తర్వాత..**ఓఆర్‌ఆర్ పరిధి వరకు చెరువుల పరిరక్షణ బాధ్యతను కొత్తగా ఏర్పడిన హైడ్రాకు అప్పగించారు. తొలుత చెరువుల ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ఆక్రమణల గురించి ప్రజలు సమాచారం ఇచ్చేలా ప్రత్యేకంగా ట్రోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేశారు. వచ్చే నెలాఖరు నాటికి హైడ్రాలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకం జరగనుంది.

# రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 34 వ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు తుంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను గురువారం ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి, పిజికల్ డైరెక్టర్ సత్తిరెడ్డి లు అభినందించారు. క్రీడలు ఈనెల 13 నుండి శ్రీ సాయి హై స్కూల్ మల్లాపూర్ మౌలాలి హౌసింగ్ బోర్డ్




కాలనీ గ్రౌండ్ హైదరాబాదులో ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టుకు తూముకుంట పాఠశాలకు చెందిన బాలుర విభాగంలో 1)జి సాయి 2) ఉదయ్ కిరణ్ 3) అనిల్ 4) హేమంతరావు బాలికల విభాగంలో 1) అలేఖ్య 2) మౌనిక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, జై హింద్ ఖో ఖో క్లబ్ సభ్యులు క్రీడాకారులను అభినందించారు.

# నల్సర్ లా యూనివర్సిటీ విద్యార్థులమైన తమకు సైతం సమాన హక్కు కల్పించాలి..

శామీర్ పేట, (గరుడ వార్త ): నల్సర్ లా యూనివర్సిటీలో తమకు సైతం సమాన హక్కులు కల్పించాలని మేనేజ్మెంట్ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేటలోని నల్సర్ న్యాయ విద్యాలయంలో విద్యార్థులందరికీ సమాన హక్కులు కల్పించాలని ఎంబీఏ, ఐపీఎం, బి బి ఏ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ న్యాయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకే సరైన న్యాయం జరగడం లేదని విమర్శించారు. యూనివర్సిటీ లో లా చదువుతున్న విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను బి బి ఏ, ఎం బి ఏ, ఐ పి ఎం కోర్సులు చేస్తున్న విద్యార్థులకు కల్పించకుండా రెండో పౌరులుగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టి మెనేజ్మెంట్ కోటాలో చదివే





విద్యార్థులను చిన్న చూపు చూస్తున్నారన్నారు. యూనివర్సిటీ విద్యార్థి సంఘంలో సభ్యులుగా సైతం ఇప్పటివరకు లేకుండా చూస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం, మెస్ కమిటీ లో మమ్మల్ని సభ్యులుగా లేకుండా నిరోధించడం అన్యాయం అన్నారు. మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని తెలిపారు. ఎల్ ఎల్ బీ చదివే విద్యార్థులకు ఉన్న ప్రాధాన్యత వేరే ఇతర కోర్సులు చేసే వారికి లేదన్నారు. యూనివర్సిటీలో మొత్తం 1200 మంది విద్యార్థులు ఉంటే ఎల్ ఎల్ బీ కాకుండా ఇతర కోర్సులు చదివే విద్యార్థులు 500 మంది ఉన్నారని తెలిపారు. విద్యార్థులు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అందరూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమం లో బి బి ఏ, ఎం బి ఏ, ఐ పి ఎం విద్యార్థులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



తార్నాక : వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని తార్నాకలోని సీట్ నెంబర్ 10 లో ఆడమ్స్ హెవెన్ లో ఏర్పాటు చేసిన గణనాథునికి విజయేందర్ లాషియల్ తో కలిసి బి లాల్ మోహన్ పటార ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలని కోరారు. భగవంతుని తలుచుకుంటూ సమాజ సేవ చేయాలని అప్పుడే తృప్తి ఉంటుందని తెలిపారు.

# రుణమాఫీపై ఆశలు

సిరిసిల్ల : అరకొర ఉపాధితో తల్లడిల్లుతున్న నేత కార్మికుల కుటుంబాలకు పోషణ భారమైంది. చేతినిండా పని లేక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా నేతన్నలకు భరోసా ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో ఐఐటీహెచ్ ప్రారంభం సందర్భంగా ఆయన సిరిసిల్ల నేతన్నల రుణాలు మాఫీతోపాటు రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాలకు చీరల ఆర్డర్లు ఇస్తామని ప్రకటించడం కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తి ఎక్కువగా జరిగేది జిల్లాలోనే. ఇక్కడ 30 వేల మరమగ్గాలున్నాయి. వీటిపై ఆధారపడి రెండు వేలకుపైగా ఆసాములు, ఆరు వేల మంది కార్మికులు జీవిస్తున్నారు.

**ఉపాధికి భరోసా** జిల్లా నేతన్నల కష్టాలు తీరబోతున్నాయి. గత ప్రభుత్వంలో ఏడేళ్లుగా బతుకమ్మ చీరల ఆర్డర్లతో ఆసాములు, కార్మికులకు ఉపాధి కల్పించారు. దీంతో ఏడాదిలో గరిష్ఠంగా తొమ్మిది నెలలు చేతినిండా పని లభించేది.

బతుకమ్మ చీరల స్థానంలో మహిళా సంఘాల్లోని సభ్యులకు ఏడాదికి



రెండు చీరలు ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఏటా 1.26 కోట్ల చీరలు అవసరం. ఈ మొత్తం ఆర్డర్లను సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు కేటాయించనున్నారు. దీంతో కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధికి ఢోకా ఉండదు.

చీరల ఉత్పత్తికి వాడే నూలు, డిజైన్లపై స్పష్టత రావాల్సి ఉంది. దీనికోసం చేనేత, జౌళిశాఖ జిల్లాలోని మరమగ్గాలకు ఉన్న డాబీ, జకార్డు పరికరాలతో మగువలు నచ్చి, మెచ్చే ఆధునిక డిజైన్లతో నమూనాలు సిద్ధం చేయిస్తారు. వాటిలో నచ్చిన వాటిని ఉత్పత్తి చేయించనున్నారు. దీనికి వస్త్ర పరిశ్రమలోని డాబీ, జకార్డులు అమర్చిన 14 వేల మరమగ్గాలకు ఆర్డర్లు ఇచ్చేలా ప్రణాళికలు చేయనున్నారు.

2017లో మరమగ్గాల కార్మికులకు వ్యక్తిగత రుణాలు మాఫీ చేశారు. అప్పటి నుంచి ఈ రంగంలోని వారికి రుణమాఫీ అమలు కాలేదు. నేతన్నలు ఎక్కువగా తమ ఇంటి పత్రాలను తనఖా పెట్టుకుని బ్యాంకుల్లో రుణాలు పొందుతారు. వీటితోపాటు ముద్ర రుణాలు కూడా ఉంటాయి. అయితే నేతన్నలకు సంబంధించి రూ.30 కోట్ల రుణభారం తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలోని బ్యాంకుల వారీగా నేతన్నలు పొందిన రుణాల వివరాలను సేకరిస్తేనే స్పష్టత వస్తుంది. సంఘాల అప్పులు, ఇతర వ్యక్తిగత రుణాల మాఫీ, వాటిలో వడ్డీ, అసలు ఎంత మేరకు చేస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అంతవరకు ఆసాములు, కార్మికులు వేచిచూడక తప్పదు.

# అరక 'సాగు'తోంది..!

నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి ఈ వానాకాలం సీజన్‌లో 18.08 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో ఒక్క వరి పంటనే 10.58 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో మొత్తం సాగు సాధారణ విస్తీర్ణం 20.83 లక్షల ఎకరాలు కాగా.. ఇందులో 90 శాతం విస్తీర్ణంలో ప్రస్తుతం పంటలు వేశారు. గతేడాది ఇదే సమయానికి 19.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండటం విశేషం. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో వివిధ పంటల సాగు, భూగర్భజలాలు, వర్షపాతం వివరాలతో వ్యవసాయ శాఖ తాజా నివేదికను వెల్లడించింది. సాగర్ ఎడమ కాల్వకు ఆగస్టు 2న నీటిని విడుదల చేయడంతో అప్పటి నుంచి ఈ నెల మొదటి వారం వరకు నల్గొండ, సూర్యాపేట జిల్లాలతో పాటూ ఆయకట్టు పరిధిలో సుమారు 4 లక్షల ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. మరో లక్షన్నర ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. నడిగూడెం వద్ద ఎడమ కాల్వకు గండి పడటంతో వారం రోజులుగా కాల్వకు నీటి విడుదలను ఆపేశారు. నాలుగు రోజుల క్రితం తిరిగి మిర్యాలగూడ మండలం తడమమళ్ల వరకు నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు నాట్లు కొనసాగిస్తున్నారు. - మరోవైపు పత్తి విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. గతేడాది సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగుకాగా.. ఈ ఏడాది సుమారు 80 వేల ఎకరాలు తగ్గి 7.20 లక్షల ఎకరాలకు పరిమితమైంది. తొలకరిలో సకాలంలో వర్షాలు పడకపోవడం, పత్తి



సాగుకు అదనుదాటిపోవడంతో ఈ ఏడాది పత్తి సాగు తగ్గడానికి కారణంగా సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిండుకుండల్లా నీటివనరులు

గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మూడు జిల్లాల్లోని భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులతో పాటూ చెరువులు, కుంటలన్నీ నిండుకుండలుగా మారాయి. డిండి జలాశయం ఇటీవలే నిండటంతో ఈ ప్రాజెక్టు కింద సుమారు 13 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నిమిత్తం అధికారులు కాల్వలకు నీటిని విడుదల చేయడంతో వరి నాట్లు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 60 శాతం చెరువులు అలుగు పోస్తుండగా.. మరో 20 శాతం చెరువుల్లో 80 శాతానికి పైగా నీటి నిల్వలున్నాయి. మిగిలిన 20 శాతం సైతం 50 శాతానికి పైగా నిండాయి. దీంతో ఈ దఫా అన్నింటి కిందా ఆయకట్టు సాగువుతోంది. మూడు జిల్లాల్లోనూ అధిక వర్షపాతం నమోదైంది. నల్గొండలో ఈ సీజన్‌లో 366.6 మి.మీ.ల వర్షపాతానికి గానూ ఇప్పటి వరకు 520.8 మి.మీ. కురిసింది. సూర్యాపేటలో 469.2 మి.మీ.లకు 694.8 మి.మీ. కురవగా.. యాదాద్రిలో 405.5మి.మీ.లకు గానూ 523.5మి.మీల కురిసింది. గత నెలతో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట జిల్లా భూగర్భజలాలు స్వలంగా పెరగగా... యాదాద్రిలో మాత్రం తగ్గుదల నమోదైంది. కొన్ని ప్రాజెక్టుల కింద ఆలస్యంగా నీటిని విడుదల చేయడంతో కొంత మంది ముందస్తు యాసంగికి సిద్ధమవుతున్నారు.

# ఆగని రేషన్ దందా



హైదరాబాద్: నగరం రేషన్ దందాకు కేరాఫ్‌గా మారుతోంది. ప్రతినెలా పదుల సంఖ్యలో కొత్తకేసులు నమోదవుతున్నా.. అధికారులు నియంత్రించే సాహసం చేయడం లేదు. యూసుఫ్‌గూడ, ఎల్బీనగర్, అల్వాల్, రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో గోదాములు ఏర్పాటు చేసి కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారు. కొందరు అర్ధరాత్రి ఓఆర్ఆర్ మీదుగా బియ్యం తరలిస్తుంటే.. మరికొందరు ప్యాసింజర్ రైళ్లలో తరలిస్తున్నారు.

ఇదీ తీరు.. పాతనగరంలోని పలు కాలనీల్లో గోదాములు ఏర్పాటుచేసి బియ్యం సేకరణ, రవాణా, నిర్వాహకులను ఏర్పాటుచేసి దందా సాగిస్తున్నారు. వారు తీసుకొస్తున్న బియ్యానికి లెక్కలేసి, రికార్డుల్లో నమోదు చేసి డబ్బులు చెల్లిస్తున్నారు. వీరంతా రేషన్ దుకాణం తెరవగానే ఆటోల్లో వెళ్లి లబ్ధిదారుల నుంచి రూ.10 కిలో చొప్పున నేరుగా కొనుగోలు చేస్తున్నారు.


**పాతనగరంలోనే జోరుగా..**

ఇటీవల ఘాజీమిల్లత్ కాలనీలో ఓ గోదాముపై పౌరసరఫరాల శాఖ, చాంద్రాయణగుట్ట పోలీసులు దాడులు నిర్వహించి 34క్వింటాళ్ల రేషన్ బియ్యం, 6 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు.

లాబ్‌కట్టా ప్రాంతంలో దందా కొనసాగిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. 102క్వింటాళ్లబియ్యం, 31 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు.

హసన్‌నగర్ ప్రాంతంలో ఓ రేషన్ డీలర్ నేరుగా దుకాణం నుంచే 28 క్వింటాళ్ల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిర్వాహకుడితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.రాజేంద్రనగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్‌లో మైనర్లే పావులు.. రాజేంద్రనగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్‌లో మైనర్లను పావులుగా వాడుకుంటున్నారు. స్కూల్ డ్రాపవుట్‌గా ఉన్నవారిని, మురికివాడల్లో ఉండేవారికి కమీషన్ అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గోదాములకు తరలించే క్రమంలో మైనర్లకు వాహనాలు అందించి ఒక్కో సంచి బియ్యాన్ని ఇచ్చి పంపుతున్నారు.

# చెరువుల చెర వీడేనా?



మల్యాల : 'హైడ్రా' ఈపేరు వింటేనే చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైదరాబాద్ పట్టణ శివారులోని చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)'ను అమలులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ ఆధ్వర్యంలో చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను పలువురు స్వాగతిస్తున్నారు. ఇదే తరహాలో మండలాలు, గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణకు కూడా ప్రభుత్వం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మల్యాల మండలంలోని పలు చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. మండల కేంద్రంలోని మత్తడి చెరువులో ఇప్పటికే సగం పూడ్చివేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో భవనాలు నిర్మించారు. చెరువులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు నీటిలో మునిగిపోకుండా మట్టిని పోసి చెరువు ప్రాంతాన్ని పూడ్చి వేస్తున్నారు. దీంతో చెరువులో నీటి నిలువ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయి వరద సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చెరువుల్లో ఇళ్లు నిర్మించుకునే వారి నుంచి నాయకులు, అధికారులు రూ.లక్షల్లో వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు ఫిర్యాదులున్నాయి. మార్కండేయ గుడి వద్దగల మత్తడి చెరువు(మల్యాల చెరువు) మత్తడిపైన కూడా భవన నిర్మాణాలు చేపట్టడం విశేషం. ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 50 వరకు భవన నిర్మాణాలు జరిగినట్లు సమాచారం.

మల్యాల శివారులోని సూరప్ప చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు జరిగాయి. చెరువులు, కుంటల ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలకు గ్రామపంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని కొండగట్టు ప్రాంతంలోని తుమ్మచెరువు, ముత్యపేట పరిధిలోని భీమన్న చెరువు, మారేడుకుంటలో కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు నీటిపారుల అధికారులు గుర్తించారు. కొండగట్టు ప్రాంతంలో చెరువుల్లోకి వరద నీరు వెళ్లడానికి పాత కాలువలను కూడా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో రహదారులు, నివాసాలను వరద ముంచెత్తుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులు జారీ చేశాం..**

మల్యాల మండల కేంద్రంలోని మత్తడి చెరువు, సూరప్ప చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు భవన నిర్మాణాలు జరిగినట్లు మా పరిశీలనలో తేలింది. ఈ విషయమై 2023 నుంచి రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేస్తున్నాం. సూరప్ప చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని మండల రెవెన్యూ అధికారులను కోరినప్పటికీ సర్వేయరు అందుబాటులో లేరన్న కారణంతో హద్దులు ఏర్పాటు చేయలేదు. కొండగట్టు, ముత్యంపేట గ్రామ శివారులోని చెరువులు, కుంటల్లో కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తేలడంతో గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నోటీసులు కూడా జారీ చేశారు. – తిరుపతి, డిప్యూటీ ఇంజినీరు, నీటిపారుదల శాఖ, జగిత్యాల

**కొత్తగా అనుమతులు ఇవ్వడం లేదు**

చెరువులను సంరక్షించుకుంటేనే భవిష్యత్తు తరాల వారికి మేలు జరుగుతుంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. చెరువులను పూడ్చివేస్తూ భవన నిర్మాణాలు చేపట్టడంవల్ల వరదలు జనావాసాలను ముంచెత్తుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఐబీ అధికారుల ఆదేశాల మేరకు చెరువుల్లో నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు కూడా జారీ చేశాం. కొత్తగా ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలేదు. హైడ్రా తరహాలో గ్రామాల్లోని చెరువుల పరిరక్షణకు కూడా ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటైతే బాగుంటుంది.

– శ్రీకాంత్, ఈవో, మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ

# ఊరిస్తున్న ఎమ్మెల్సీ పదవి!

కరీంనగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ. పదవులు ఆశావహుల్ని ఊరిస్తున్నాయి. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఈ ఎన్నికలు త్వరలో జరిగే వీలుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డిల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఓటరు నమోదు ప్రకియ కొనసాగించాలని ప్రకటన జారీ చేసింది. దీంతో ఆశావహ నాయకులంతా ఎవరికి వారుగా వారి ప్రయత్నాల్లో నిమగ్నమవుతున్నారు. ఇటు నాయకులు, ప్రముఖులు పట్టభద్రుల స్థానంపై కన్నేయగా.. ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా వారికున్న పరిచయాలతో పదవి దక్కించుకునే ఎత్తుగడలకు సిద్ధమవుతున్నారు.. ప్రధాన పార్టీలు కూడా బలమైన అభ్యర్థులను ఖరారు చేయాలన్న ఆలోచనతో ఉన్నాయి..

**ఈసారి గట్టి పోటీ తప్పదా!**

ఈ రెండు స్థానాలకు గట్టి పోటీ ఉండనుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానానికి 17 మంది పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి 39,430 ఓట్ల ఆధిక్యంతో అప్పటి తెరాస (భారాస) మద్దతు ప్రకటించిన చంద్రశేఖర్‌గౌడ్‌పై విజయం సాధించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఏడుగురు పోటీ చేయగా..1,707 ఓట్లతో రఘోత్తంరెడ్డి పాతూరి సుధాకర్‌రెడ్డిపై గెలుపొందారు. ఈ సారి కూడా ఈ రెండు స్థానాలకు అభ్యర్థులు పెరిగే అవకాశముంది. నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పోటీ చేసే వారు ఎక్కువగా ఉండనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటి వరకు ఆశావహుల ప్రయత్నాలు ఇంకా ప్రారంభం కాలేదు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మాత్రం కాంగ్రెస్, భాజపా, భారాస పార్టీల తరపున రంగంలోకి దిగాలనుకునే వారు ఆయా పార్టీల ముఖ్యులను కలుస్తూ తమ పేరు పరిశీలనలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

**పట్టభద్రుల స్థానానికి పలువురి పేర్లు**

పట్టభద్రుల స్థానంలో పోటీకి వివిధ పార్టీల నుంచి ప్రయత్నిస్తున్నట్లు కొంతమంది పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తరపున వెలిచాల రాజేందర్‌రావు, రోహిత్‌రావు, ప్రణవ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు భారాస నుంచి రవీందర్‌సింగ్, శేఖర్‌రావుల పేర్లు భాజపా నుంచి గతంలో పోటీ చేసిన సుగుణాకర్‌రావు, రాణిరుద్రమలు



ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇతర జిల్లాల్లోనూ ఈ మూడు పార్టీల తరపున మరికొందరు ప్రయత్నాల్లో ఉన్నారని సమాచారం. వీరెవరూ ఇప్పటి వరకు బహిరంగంగా తమ ఆసక్తిని వెల్లడించకున్నా ఆయా పార్టీల్లో మాత్రం ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు వివిధ రంగాలకు చెందిన కొత్తవారు కూడా ఈసారి పోటీకి సిద్ధమవుతున్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీఎన్‌రావు తన ఫౌండేషన్ ద్వారా గ్రంథాలయాలకు ఉచితంగా పుస్తకాలు అందిస్తూ యువతను కలుస్తూ పోటీలో ఉంటాననే సంకేతాలు ఇస్తున్నారు. భారాసకు చెందిన ముఖ్య నేతలను ఈయన కలవడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీకి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే తరహాలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి కూడా బరిలోకి దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు నేతలను కలవడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం ఉంది. ఈ విషయమై ఆయనతో మాట్లాడగా త్వరలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. వీరితోపాటు ప్రసన్న హరికృష్ణ అనే ప్రొఫెసర్ కూడా గ్రంథాలయాల వద్ద యువతను కలుస్తూ వారి మన్ననలు పొందే ప్రయత్నం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన తరగతులు, ప్రత్యేక కార్యశాలలు నిర్వహిస్తూ తాను ఎమ్మెల్సీగా రంగంలోకి దిగుతానని యువత సహకారాన్ని కోరుతున్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యాక ఆశావహుల సంఖ్య, కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# నిధులివ్వరేం..!

నల్గొండ : గడియారం కేంద్రం నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనుల చిత్రమిది. కలెక్టర్ బంగ్లా, మైసయ్య విగ్రహం ప్రాంతంలో టైల్స్ ఏర్పాటు చేయకుండానే అసంపూర్తితో మధ్యంతరంగా నిలిపివేశారు. గుత్తేదారుడికి బిల్లులు రాకపోవడంతో ఏడాది కాలంగా పనులు ఆగిపోయాయి. పట్టణాలకు నిధుల కొరత వెంటాడుతోంది. నల్గొండ జిల్లాలోని ఎనిమిది పురపాలికలకు పట్టణ ప్రగతి నిధులు నెలవారీగా రాకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ప్రతిపాదించిన పనులు కాగితాలకే పరిమితమవుతుండగా..పూర్తి చేసినవాటికి బిల్లులు రావడం లేదు. పట్టణాల్లో ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేసి, ప్రతి నెల బిల్లులు చెల్లించేందుకు 2020లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి పథకాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. జనాభా ప్రతిపాదికన పట్టణాలకు రూ.20 లక్షల నుంచి రూ.1.60 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. తదుపరి పట్టణ ప్రగతి నిధుల్లో 25 శాతం కోత విధించారు. అయినా క్రమం తప్పకుండా నిధులను విడుదల చేయడం లేదు.

పురాలకు ఆస్తి, నల్లాకుళాయి పన్నుల ద్వారా రావాల్సిన ఆదాయం



అంతంత మాత్రంగానే ఉంటుంది. పట్టణాల అభివృద్ధి పట్టణ ప్రగతి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కీలకం, ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యేలు, ఎంపీ నిధులు గతంలో కేటాయించే వారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా ఇతర నిధులు, గ్రాంట్లు రావడం లేదు.

ఆస్తి పన్నుల రూపంలో వచ్చిన నిధులు కార్మికుల వేతనాలు, కరెంటు బిల్లులు, పారిశుధ్య వాహనాల నిర్వహణ వంటి వాటికే సరిపోవడం లేదు. ఇప్పటికే ఆయా పురపాలికల్లో నిధుల నిలుపుదలతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాత పనులు చేసిన వారికి ఒక్కో పురపాలిక సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.కొరత వాస్తవమే: ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలికఏడాది కాలంగా పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. కేవలం ఆస్తి పన్నులు, 15వ ఆర్థిక సంఘం నిధులతోనే నెట్టకొస్తున్నాం. ప్రతి నెల రూ.3.5 కోట్ల వరకు నిర్వహణ ఖర్చులు వస్తున్నాయి. కొత్తగా పనులు చేపట్టాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి చేసిన వారికి సుమారు రూ.15కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

# ఎంత కష్టం.. ఎంత నష్టం..?

ఖమ్మం: భారీ వర్షాలు, వరదలు ఖమ్మం జిల్లాను అతలాకుతలం చేశాయి. మున్నేరు విలయం అపార నష్టాన్ని మిగిల్చింది. నిలువనీడ లేక బాధిత కుటుంబాలు బోరుమంటున్నాయి. ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలు దెబ్బతినటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు నష్టపోయి విద్యార్థులు ఘొల్లుమంటున్నారు. జిల్లాలో రూ.417.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికార యంత్రాంగం ప్రాథమికంగా ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో వరదల ధాటికి ఆరుగురు మృతిచెందినట్లు ప్రస్తావించింది. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సర్కారు పరిహారం అందజేసింది.

సాగునీటి పారుదల శాఖకు రూ.100 కోట్లు

జిల్లాలో 103 పనులకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. 45 చెరువులకు గండ్లుపడ్డాయి.అనేకచోట్ల కాల్వలు కొట్టుకుపోయాయి. ఎత్తిపోతల పథకాలు మునిగిపోయాయి. అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరమని ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. నీటిపారుదలశాఖకు మొత్తమ్మీద సుమారు రూ.100కోట్ల నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు.విద్యుత్తు సంస్థకు రూ.14.05 కోట్లు

జిల్లాలో 4,500 విద్యుత్తు స్తంభాలు, 600 నియంత్రికలు దెబ్బతిన్నాయి. 300 కి.మీ మేర తీగలు తెగిపోయాయి. 56 గ్రామాల్లో 300 వ్యవసాయ నియంత్రికలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మొత్తమ్మీద విద్యుత్తు సంస్థకు రూ.14.05 కోట్ల నష్టం వాటిల్లింది.

అన్నదాతలకు కోలుకోలేని దెబ్బజిల్లాలో 5,14,395 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా వీటిలో 79,914 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 54,045 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ శాఖకు రూ.111.87 కోట్ల నష్టం వాటిల్లింది. 53,648 పశువులు చనిపోవటంతో రూ.1.16 కోట్ల నష్టం సంభవించింది. 3,500 టన్నుల చేపలు కొట్టుకుపోయాయి. మత్స్యశాఖకు రూ.4.29 కోట్లమేర నష్టం వాటిల్లింది.ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.180.37 కోట్లు

జిల్లాలో 76 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. రూ.180.37 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికార యంత్రాంగం గుర్తించింది.ఇతర శాఖల వారీగా వాటిల్లిన నష్టం (రూ.కోట్లలో)

వైద్యం: 9.23
విద్య: 1.20
రెవెన్యూ: 0.30
పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు: 15,056
పూర్తిగా దెబ్బతిన్న గృహాలు: 146

జిల్లాలో వరుణుడి జోరు

కొత్తగూడెం జిల్లాలో 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాతం (మి.మీ.లలో) వివరాలు... దుమ్ముగూడెం-17.3, కరకగూడెం-15.5, ఇల్లెందు-15.5, మణుగూరు-14.0, అశ్వాపురం- 13.5, ఆళ్లపల్లి-9.8, గుండాల-8.8, సుజాతనగర్-8.0, లక్ష్మీదేవిపల్లి-7.0, భద్రాచలం (గోదావరి బ్యాంక్)-6.8, చుంచుపల్లి-6.3, కొత్తగూడెం(పాత కొత్తగూడెం)-4.8, దమ్మపేట (మందలపల్లి)-3.8, టేకులపల్లి-3.5, జూలూరుపాడు-2.0, అశ్వారావుపేట-2.0, దమ్మపేట(మల్కారం)-2.0.

భారీ వర్షాలు, వరదల ధాటికి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేశాం. పూర్తిస్థాయిలో నష్టంపై సర్వే జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుంటాం. ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్, ఖమ్మం

# ఎల్లంపల్లి పైపులైన్ల స్థలం ఆక్రమణ

గంగాధర: ఈ చిత్రంలో పైకి తేలిన రెండు పైపులైన్లు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లిలోనివి. మూడేళ్ల కిందట పైపులపై ఉన్న మట్టిని కొందరు తొలగించి చదును చేయడంతో పైపుల కిందకు నీరు వెళ్లి పైకి తేలాయి. తర్వాత ఏడాది యాసంగిలో ఉమ్మడి జిల్లాకు ఎల్లంపల్లి నీరు రాక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటన నుంచి అందరూ గుణపాఠం నేర్చుకోవాల్సి ఉన్నా.. పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు.

**59 కి.మీ. పొడవునా ఆక్రమణలే..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 59 కి.మీ పొడవున 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేసి నీటిని ఎత్తిపోస్తున్నారు.
ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం రిజర్వాయర్‌లోకి 11 కి.మీ నీటిని ఎత్తిపోసి అక్కడి నుంచి 25.50 కి.మీ దూరంలోని గంగాధర, నారాయణపూర్ జలాశయాల్లోకి, ఇక్కడి నుంచి 10.892 కి.మీ దూరంలోని కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లతో ఎత్తిపోస్తారు. – ఒక వరుస పైపులైన్‌తో కొడిమ్యాల నుంచి 4.935 కి.మీ దూరంలో ఉన్న పోతారం జలాశయం, ఇక్కడి నుంచి 4.200 కి.మీ దూరంలోని సూరంపేట, జోగాపూర్ రుద్రంగి బ్రిడ్జి 5.800 కి.మీ, జోగాపూర్ నుంచి న్యూ ట్యాంకు చందుర్తి 4.68 కి.మీ చెరువులోకి నీటిని ఎత్తిపోసి ఇక్కడి నుంచి కాలువల ద్వారా పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. పైపులైన్ల పొడవున ఆక్రమణలు చేసి పంటలు వేస్తుండగా ప్రమాదం పొంచి ఉంది.

**నీటితో సిరుల పంట**



ఎల్లంపల్లి నీరు రాక ముందు చొప్పదండి నియోజకవర్గం ఎడారి ప్రాంతంగా ఉండేది. ఏడేళ్లుగా రెండు పంటలు పండిస్తున్నారు. రెండు వరుసల ఎల్లంపల్లి పైపులపై 40 మీటర్ల మేరకు భూములు సేకరించి అప్పట్లోనే రైతులకు నష్టపరిహారం చెల్లించారు.
పైపులైన్లపై అక్కడక్కడా గేట్‌వాల్వులు, ఏయిర్‌వాల్వులు కేటాయించగా పైపులు పైకి తేలకుండా మట్టి పోశారు. అయితే కొందరి నిర్వాకంతో చాలామంది నష్టపోయారు. పైపులైన్లపై పంటలు వేయడంతో.. పైపులు పైకి తేలి.. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఇలాంటి ఘటనటు ధర్మారం మండలం, గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో రెండుచోట్ల చోటు చేసుకుంది. **అధికారులు కదిలితేనే..** – సాగునీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ఎల్లంపల్లి పైపులైన్ల ఖాళీ స్థలాన్ని గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలకు స్థల సమస్య నెలకొనగా.. ఈ ఖాళీ స్థలాన్ని వాటికి వినియోగించుకునే అవకాశము ంది. ఇలా చేస్తే పైపులైన్ల స్థలం కబ్జాకు గురికాకుండా, పైపులైన్ల మరమ్మతులకు సమస్య తలెత్తినా పరిష్కరించుకునే వీలుంటుంది.సమస్య ఉందికొందరు ఎల్లంపల్లి పైపులైన్ల స్థలం కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. పైపులైన్లు దెబ్బతింటే వాటిని మరమ్మతు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. గతంలో పెద్దపల్లి జిల్లాలో కొందరు చేసిన ఆక్రమణలతో చాలామందికి సాగునీరు అందించలేకపోయాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – సంతుప్రకాశ్‌రావు, ఈఈ ఎల్లంపల్లి

## ఛిద్రమైన రహదారులు.. తప్పని తిప్పలు

పెద్దపల్లి : జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. రోడ్లపై గుంతలు ఏర్పడి, వంతెనల వద్ద మట్టి కుంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రతిపాదనలు చేసేలోపే మరోచోట రోడ్డు దెబ్బతింటున్న పరిస్థితి.
**ఏళ్లుగా సమస్యలు** జిల్లాలో ప్రధాన రహదారులతోపాటు అనుసంధాన రోడ్లు నిత్యం దెబ్బతింటున్నాయి. కొన్నాళ్ల నుంచి ప్రతిపాదనలకు నోచుకోకపోవడంతో ఎక్కడికక్కడే గుంతలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల మధ్యలోని వాగులపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. కొన్నిచోట్ల వరద ఉద్ధృతి తట్టుకోలేక గొయ్యిలా మారుతున్నాయి. జిల్లాలో ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్ మండలాల్లో ఇసుక క్వారీలతో తారు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల రాకపోకలు నిలిచినప్పటికీ ఇబ్బందులకు మోక్షం కలగడం లేదు. **నిధులు కేటాయిస్తేనే ప్రయోజనం**
గతేడాది దెబ్బతిన్న రోడ్లపై మొరం పోసి చేతులు దులుపుకొన్నారు. శాశ్వత మరమ్మతుల ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. ఈ ఏడాది వానలకు రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కొరవడుతున్నాయి. జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు వేర్వేరుగా తమ పరిధిలోని రోడ్ల మరమ్మతులు చేసే చర్యలకు ఉపక్రమించారు. నిధులు విడుదల చేస్తే ప్రయోజనం కలగనుంది. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లను గుర్తిస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్ తెలిపారు. తాత్కాలికంగా మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో తమ పరిధిలో రోడ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా పనులు చేపడుతున్నామని పీఆర్ ఈఈ గిరీశ్‌బాబు తెలిపారు.
ఇదీ మడుగు కాదు.. తారు ధ్వంసమై గుంతలుగా మారిన ముత్తారం మండలం ఖమ్మంపల్లి రోడ్డు. ముత్తారం మండలంతో పాటు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లకు వెళ్లె ప్రధాన రోడ్డు దెబ్బతింది. తారు మాయమై మట్టిని తలపిస్తున్న ఈ రోడ్డు జూలపల్లిలోనిది. ఏడాది క్రితం తారు తొలగించి కంకర పొడి చల్లగా వానలకుతోడు వాహనాల రద్దీతో కొట్టుకుపోయింది. రోడ్డు గుంతలుగా మారడంతో ప్రయాణం ఇబ్బందిగా సాగుతోంది. పాలకుర్తి మండలం వెక్లాస్‌పూర్, పుట్నూర్ మధ్యలో కుంగిన వంతెన ఇది. గ్రామాలకు రాకపోకలు అందించే ఈ రోడ్డులో కల్వర్టు కుంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

# కంచె దాటుతున్నా.. కళ్లు మూసుకున్నారు



హైదరాబాద్: ఒకప్పుడు రాజధానికి తాగునీటిని అందించిన జంటజలాశయాలను పరిరక్షించడంలో అటు ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఇటు జలమండలి ఘోరంగా విఫలమయ్యాయి. వీటి పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు వస్తున్నా సంబంధిత శాఖల్లోని కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోలేదు. కీలకమైన హిమాయత్‌సాగర్ పరిధిలో ఇప్పటికీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులు గుర్తించి తుది నోటిఫికేషన్ ఇవ్వడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమయ్యారని హైడ్రా పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. కూల్చివేతల క్రమంలో తుది నోఫికేషన్‌ను ఇవ్వాలని హైడ్రా అధికారులు అడిగితే అసలు విషయం చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన తుది నోటిఫికేషన్ ఇవ్వాలని కోరడంతో ఇప్పుడు సంబంధిత అధికారులు ఆ పనిలో ఉన్నారు.

**పదేళ్ల కిందట సర్కారు ఆదేశించినా..**

జంటజలాశయాలను రక్షించడం కోసం అనేక ఏళ్ల కిందటే ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం 111 జీవోను తీసుకువచ్చింది. వీటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోకి వచ్చే ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క నిర్మాణం కూడా ఉండకూడదని ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా హద్దులను గుర్తించి నిర్ధారణ చేస్తూ తుది నోటిఫికేషన్ ఇవ్వాలని పదేళ్ల కిందట సర్కార్ సంబంధిత అధికారులను ఆదేశించింది. జలమండలి, రెవెన్యూ అధికారుల తోడ్పాటుతో క్షేత్రస్థాయిలో హద్దులు గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. విచిత్రంగా ఇప్పటివరకు అధికారులు హిమాయత్‌సాగర్‌కు తుది నోటిఫికేషన్ ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో హద్దులను గుర్తించారు గానీ తుది నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల అక్రమ భవనాలను నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీలుండదని కిందిస్థాయి అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఈ పరిధిలోని భవనాలను కూలగొట్టే ప్రయత్నం చేస్తే సంబంధిత నిర్మాణదారులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తే వారికి కొంతకాలం గడువు లభించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో తక్షణం తుది నోటిఫికేషన్ ఇవ్వాలని హైడ్రా అధికారులు జలమండలి, సాగునీటి శాఖలను కోరడంతో హడావుడిగా ప్రక్రియను మొదలుపెట్టారు.
**హద్దు మీరారని తేలితే కూల్చివేతలే..**గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు కచ్చితంగా ఉన్నాయా లేదా అన్న దానిపై హైడ్రా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ హద్దులు కచ్చితంగా ఉన్నాయని తేలితే తుది నోటిఫికేషన్‌కు చర్యలు తీసుకుంటారు. ఎక్కడైనా తేడా వస్తే మరోసారి సర్వే జరిగే అవకాశం ఉందని హైడ్రా అధికారి ఒకరు తెలిపారు. ఉస్మాన్‌సాగర్( గండిపేట) పరిధిలో 2019లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను నిర్ధారిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చారు. హిమాయత్‌సాగర్‌కు తుది నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత మొదటి దశలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రా ప్రణాళిక రూపొందిస్తోంది. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బపర్ జోన్లలో ఉన్న తమ నిర్మాణాలను కొంతమంది రాజకీయ నాయకులు కూల్చివేశారు. హైడ్రా రాకముందే వీటిని కూల్చివేస్తే కొంత గౌరవంగా ఉంటుందని పలువురు నేతలు, అధికారులు, నిర్మాణదారులు భావిస్తున్నారు.

# ఒక్క మీటతో పాఠశాల సమగ్ర చరిత్ర




హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు.. విద్యార్థులు.. ఉపాధ్యాయులు.. డెస్కులు.. బల్లలు.. ఇలా అన్ని వివరాలు ఒక్క మీటతో తెలిసిపోనున్నాయి. పాఠశాల విద్య.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించేందుకు.. కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ అనే వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఒక వినూత్న సంఖ్య కేటాయించినట్టే.. ఉపాధ్యాయులకూ జాతీయ కోడ్ నంబరును యూడైస్ ప్లస్ కేటాయిస్తుంది. దీంతో ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య తెలుస్తుంది.
ఈ వివరాల ద్వారా ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని లెక్కించి పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనుంది. యూడైస్ వెబ్‌సైట్(పోర్టల్) ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేసేందుకు త్వరలో ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ శిక్షణ ఇవ్వనుంది.


**ప్రామాణికం.. తప్పనిసరి**

ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యతోపాటు పాఠశాలలకు అందుతున్న ఆర్థిక వనరులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రత్యేక పథకాల వివరాలను యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. వీటిని ప్రామాణికంగా నిర్వహించేందుకు మండల విద్యాధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర సంచాలకుల కార్యాలయం వరకు వివిధ అంచెల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వివరాల నమోదును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిచేసిన దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల వివరాలను నిర్ణీత గడువులో నమోదు చేయాలి. ఈ అంశాలను జిల్లా ప్రణాళిక సమన్వయకర్తలు పర్యవేక్షించనున్నారు.

**ప్రయోగశాలలు.. క్రీడా సామగ్రి**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా కంప్యూటర్, సైన్స్ ప్రయోగశాలలను ఏర్పాటు చేసేందుకు యూడైస్ ప్లస్ ఉపయోగపడనుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.
ఒక్కో పాఠశాలకు ఎన్ని ప్రయోగశాలలు కావాలన్న అంశాన్ని ప్రతిపాదిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాని ఆధారంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్‌ను కేటాయించనున్నాయి.
యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు వీలుంటుంది.
భవిష్యత్తులో పదో తరగతి విద్యార్థుల పేర్లు, వివరాలను నామినల్ రోల్స్ ద్వారా యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తేనే పరిగణలోకి తీసుకోనున్నారు.

# తీరనున్న తాగునీటి కష్టాలు



కరీంనగర్ : కొత్తగా ఏర్పడిన పురపాలికలతోపాటు పాత పురపాలికల్లో విలీనమైన కాలనీల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్ల కిందట అమృత్ 2.0 కింద నిధులు కేటాయించినా ప్రక్రియ ఆలస్యమైంది.. దీంతో ఆయా ప్రాంతాలు, కాలనీల్లో ఎండాకాలం వచ్చిందంటే జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. ఇటీవలే నిధుల కేటాయింపు, టెండర్ల ఆమోదం పూర్తవడంతో అధికారులు పనులు ప్రారంభించడానికి కసరత్తు ప్రారంభించారు.. దీంతో భవిష్యత్తులో తాగునీటి కష్టాలు తీరనున్నాయి..
అమృత్ 2.0 ఇలా..ఉమ్మడి జిల్లాలో 14 పురపాలికలు, రెండు నగరపాలికలు ఉండగా ఇందులో ఆరు కొత్తగా ఏర్పడిన పురపాలికలు ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ మినహాయిస్తే మిగతా 15 పట్టణాల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు. పంచాయతీల హయాంలో, ఆ తర్వాత రూరల్ మిషన్ భగీరథ కింద వేసిన పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఎండాకాలంలో తాగునీటితోపాటు ఇతర అవసరాలకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద విలీన కాలనీలు, పురపాలికలకు నిధులు మంజూరు చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కేటాయించింది. భవిష్యత్తు జనాభాను పరిగణనలోకి తీసుకొని తాగునీటి వ్యవస్థను రూపొందించుకోవడానికి ప్రజారోగ్యశాఖ ప్రణాళికలు చేసింది. అమృత్ 2.0లో ఫిల్టర్ బెడ్‌లు, పైపులైన్లు విస్తరించడం, కొత్తగా రిజర్వాయర్ల నిర్మాణం, ఫీడర్ పైపులైన్లు, పంపిణీ లైన్లు, కొత్త నల్లా కనెక్షన్లు, బల్క్ మీటర్లు వంటి పనులు చేపడుతారు. దీంతో విలీన కాలనీలు, శివారు కాలనీల్లో ఎండాకాలంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు ఇబ్బందులు దూరం కానున్నాయి. ఈ పనులు సకాలంలో పూర్తయితే వచ్చే ఏడాదిలో పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు దూరం కానున్నాయి.
నాలుగు చోట్ల శంకుస్థాపన..కొనసాగుతున్న సర్వే
అమృత్ పథకంలో తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు 14 పురపాలికలు, ఒక నగర పాలికను మొదటి ప్యాకేజీలో చేర్చారు. ఈ ప్యాకేజీలో రూ.516.45 కోట్లు కేటాయించారు. రాష్ట్ర స్థాయిలో టెండర్ పూర్తి చేయగా ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. స్థలాల సేకరణ చేయాల్సి ఉంది. వీటిని త్వరగా అప్పగిస్తే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు వేములవాడ, మంథని, ధర్మపురి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో శంకుస్థాపనలు చేశారు. అమృత్ కింద తాగునీటి పథకాల పనులు రెండు నెలల్లో ప్రారంభం అవుతాయని కరీంనగర్ ప్రజారోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. స్థలాలు చూపించి అప్పగించాలని కోరుతూ ఆయా కమిషనర్లకు లేఖలు కూడా పంపించామని, వారి ఆమోదం తీసుకొని పనులు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# చట్టాలు తెలుసుకొని.. వాదనలు వినిపిస్తూ!

కరీంనగర్ : న్యాయవాద వృత్తిలోకి రావడమంటే సాహసమైన నిర్ణయం తీసుకున్నట్టేనని చాలామంది చెబుతుంటారు. అందులోనూ అతివలు అతి తక్కువ మంది వస్తుంటారు. కానీ ఇటీవల పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. మహిళలూ ఇటు వైపు అడుగులు వేస్తున్నారు. గతంతో పోలిస్తే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ రంగంలోకి వచ్చిన వారేమంటున్నారో కథనం.
ఆరు వందల మంది వరకు..
ఈ వృత్తిలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే నిత్య విద్యార్థిలా చట్టాల గురించి, పలు ఉన్నత న్యాయస్థానాలలో వెలువడుతున్న తీర్పుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ప్రస్తుతం న్యాయ విద్యాబోధనలో అనేక మార్పులు వచ్చాయి. ఇంజినీరింగ్, వైద్య విద్యతో పాటు న్యాయ కళాశాలలూ పెరుగుతున్నాయి. అయిదారు ఏళ్ల వరకు కరీంనగర్ జిల్లా కోర్టులో కేవలం పది మందిలోపే మహిళా న్యాయవాదులు కనిపించేవారు. ప్రస్తుతం 200 మంది వరకు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు వందల మంది వరకు ఉన్నారు. పట్టుదలతో ఎంతోమంది న్యాయశాస్త్ర పట్టా అందుకుంటున్నారు. న్యాయం కోసం వచ్చే వారికి మేమున్నామనే భరోసా ఇస్తున్నారు. ఏటా పదుల సంఖ్యలో న్యాయవాద పట్టా పుచ్చుకుంటున్నా.. పరిస్థితులనుబట్టి వారు వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు.



కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అవసరం
ప్రతి ఒకరికీ చట్టాలపై అవగాహన అవసరం. అందుకే ఈ రంగంలోకి వచ్చా. మహిళా న్యాయవాదులకు ప్రత్యేకమైన బార్ అసోసియేషన్ గదులను, సదుపాయాలు కల్పించాలి. సీనియర్ల వద్దకు చేరగానే కక్షిదారుల కేసులను అధ్యయనం చేయాలి. మహిళలు ఇటు వైపు వచ్చేలా కుటుంబసభ్యులు ప్రోత్సహించాలి.
– సర్దార్‌నీ మీతా కౌర్
**అమ్మ సహకారంతో..**అమ్మ సహకారంతో న్యాయవాద వృత్తిలోకి వచ్చా. చాలామంది స్త్రీలు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి వారికి మహిళా న్యాయవాదులు అండగా ఉంటున్నారు. ఆపద సమయంలో ఏం చేయాలో తెలియజేస్తున్నారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్నామనే భావన ఉండాలి.
ఆసియా బేగం
నిరంతర కృషి ఉంటేనే..
న్యాయవాద వృత్తిలో కొనసాగాలంటే నిరంతర కృషి ఉండాలి. పోలీసు కేసులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదించడానికి ప్రభుత్వ న్యాయవాదిగా విధులు నిర్వర్తించాను. జూనియర్ న్యాయవాదులు కర్తవ్యంగా భావించి విధులు నిర్వహిస్తేనే ఇందులో రాణించగలరు. – ఆర్.వి.గీతారెడ్డి
పురుషులతో సమానంగా..న్యాయవాద వృత్తిలో పురుషులతో సమానంగా మహిళలు ముందుకు వస్తున్నారు. వృత్తిలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తున్నారు. కొన్నిసార్లు పోలీసుస్టేషన్, రెవెన్యూ కార్యాలయాలకు కక్షిదారుల తరఫున వెళ్లాల్సి ఉంటుంది. మా వద్దకు వచ్చేవారికి న్యాయం జరిగేలా సలహాలు ఇస్తున్నాం. జీవనోపాధి కోసమే వృత్తిలోకి వచ్చామని కాకుండా సమాజ సేవ కోసమే అన్నట్లుగా ఉండాలి.
– మూల తిరుమల దేవి
వృత్తిపై గౌరవంతో..మా నాన్న రాజకీయాలలో ఉండేవారు. ఆయనకు న్యాయవాదులంటే ఎంతో గౌరవం. ఆ స్ఫూర్తితో ఈ వృత్తిలోకి వచ్చా. స్వశక్తి మహిళా సంఘాల ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించా. చట్టాలపై అవగాహన కల్పించా. ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా.– మెతుకు హేమలత

## ఉల్లంఘిస్తే.. లైసెన్స్‌పై వేటే

హైదరాబాద్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై పూర్తి స్థాయిలో కొరడా ఝుళిపించేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. దాదాపు 90శాతం వరకు రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణం కావడంతో మరింత కఠినంగా ట్రాఫిక్ నిబంధనల అమలుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం డ్రంకెన్ డ్రైవ్, నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ తదితర కొన్ని ఉల్లంఘనలకు మాత్రమే లైసెన్సులను సస్పెండ్ చేస్తున్నారు. సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ లాంటి వాటికి చలానాలతో సరిపెడుతున్నారు. ఇక నుంచి ఇలాంటి ఉల్లంఘనలపైనా ఉదాసీనత ఉండకూడదని రవాణా శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి



పరిధిలో 16,649 మంది లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో 7,565 లైసెన్సుల సస్పెన్షన్‌కు రవాణా శాఖ నిర్ణయించింది. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే అధికం. ఇతర కొన్ని ఉల్లంఘనలకు చలానాలు రాస్తున్నా.. కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. దీంతో అన్ని రకాల ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారి లైసెన్సులు 3–6 నెలల పాటు సస్పెండ్ చేయనున్నారు. దీంతో వాహనాలు నడిపే అవకాశం కోల్పోతారు. లైసెన్సు సస్పెన్షన్ సమయంలో వాహనాలు నడిపితే కేసులు నమోదుచేయనున్నారు. లైసెన్సులు సస్పెండ్ చేస్తే.. విదేశాలకు వెళ్లే యువతకు నష్టమే.

# రెవెన్యూ సేవలకు.. నగదు రహిత చెల్లింపు

సూర్యాపేట : ప్రభుత్వానికి సంబంధించి ఏ ధ్రువపత్రం కావాలన్నా, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలను తప్పనిసరిగా ఆశ్రయించాల్సిందే. దీన్ని అదనుగా చేసుకొని కొందరు మీసేవ నిర్వాహకులు సర్వర్ సమస్య, ఇతర కారణాలు చూపుతూ పనులు ఆలస్యం చేస్తున్నారు. త్వరగా ధ్రువపత్రం రావాలంటే ప్రభుత్వ ధరల కంటే అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అధికారులకు వస్తుండటంతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పారదర్శక చెల్లింపులకు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా తొలుత రెవెన్యూ సేవలకు క్యూఆర్ కోడ్ ద్వారా నగదు రహిత లావాదేవీలను అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ విధానాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మీ సేవల్లోనూ అమలు జరిగేలా సంబంధిత నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది.

**కొత్త విధానంలో చెల్లింపులు ఇలా..**

ఉమ్మడి జిల్లాలో 320 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ధరల పట్టిక ప్రదర్శించకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ విధానం ద్వారా వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుంది. ధ్రువీకరణ పత్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పేమెంట్ ఆప్షన్ వస్తుంది. సంబంధిత ధ్రువీకరణ పత్రానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎంత అనేది చరవాణికి సంక్షిప్త సమాచారంతోపాటు లింక్ వస్తుంది. అప్పుడు దరఖాస్తుదారులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. నగదు బదలాయింపులు జరగగానే రసీదు ప్రింట్ వస్తుంది. ఈ విధానం ద్వారా అదనపు వసూళ్లకు తావుండదని, నిర్ణీత రుసుం మాత్రమే చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మీసేవ కేంద్రాల వివరాలు

నల్గొండ: 154

సూర్యాపేట: 91

యాదాద్రి: 75

త్వరలో అన్ని సేవలకు..

గఫార్, ఈడీఎం, సూర్యాపేట

మీసేవ కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ దిశగా క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఇప్పటికే అన్ని కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించి ఈ విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందించాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. త్వరలో మిగతా సేవలకూ ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నూతన విధానంతో అదనపు వసూళ్లకు అవకాశం ఉండదు.

# వరదొస్తోంది మామో..!

నల్గొండ : నాగార్జునసాగర్‌కు రెండేళ్ల అనంతరం వరద వస్తోంది. జులై నెలలో సాగర్‌కు ప్రవాహాలు మొదలుకావడం గత ఐదేళ్లలో ఇది నాలుగోసారి. శ్రీశైలం జలాశయంలోని మూడు గేట్లను ఎత్తడం, విద్యుదుత్పత్తి ద్వారా సుమారు 1.60 లక్షల క్యూసెక్కుల నీటిని సోమవారం సాయంత్రం దిగువకు వదులుతుండటంతో సాగర్ జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు వద్ద 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా.. ఉదయం నాటికి ఇది లక్షన్నర క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. రానున్న రెండు మూడు రోజుల్లో శ్రీశైలం నుంచి మరిన్ని గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగే నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో మరింత పెరగనుంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మరో నాలుగైదు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది. దీంతో వరద ప్రవాహం ప్రాజెక్టులోకి స్థిరంగా వారం రోజుల పాటూ కొనసాగే అవకాశం ఉందనే అంచనాల మధ్య.. ఆగస్టు 10లోపు సాగర్ జలాశయం నిండుకుండ కానుంది. కృష్ణ బేసిన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో గతేడాదే సాగర్‌కు ఆశించినంత ప్రవాహాలు రాలేదు. అంతకుముందు ఐదేళ్లు భారీ వర్షాలు పడి ఆగస్టు నెలలోనే రెండు కాల్వలకు అధికారులు నీటిని విడుదల చేశారు.ఐదారు రోజుల్లో కాల్వలకు నీళు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగితే సాగర్ కుడి, ఎడమకాల్వలకు ఐదారు రోజుల్లో నీటిని విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కృష్ణా నది యాజమాన్య బోర్డు



(కేఆర్ఎంబీ) ఆధీనంలో ఉండటంతో కేంద్ర జలవనరుల శాఖ ఆదేశం మేరకు నీటి విడుదల ఉండనుందని ఎన్నెస్పీ అధికారులు వెల్లడిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వ కింద నల్గొండ, సూర్యాపేట జిల్లాలో 3.3 లక్షల ఎకరాలు ఉండగా..ఎత్తిపోతల పథకాల కింద మరో 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏఎమ్మార్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కింద మరో 2.5 లక్షల ఎకరాలు సాగవుతుంది. తాజా పరిస్థితులతో ఉమ్మడి జిల్లాలో గత యాసంగి సీజన్ కంటే సుమారు ఆరు లక్షల ఎకరాల్లో వరి సాగు పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఐదేళ్లలో సాగర్‌కు ఆగస్టులో నీటిని విడుదల చేయడం మూడోసారి. మరోవైపు ఎగువ నుంచి భారీ వరద వస్తున్నందున కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపలుపట్టడానికి వెళ్లవద్దని.. ఈత, పశువులను నదిలోకి తీసుకెళ్లడం లాంటివి పరిసర ప్రాంతాల ప్రజలు చేయవద్దని నల్గొండ కలెక్టరు నారాయణరెడ్డి హెచ్చరించారు.

# దిగువన గోదారి.. ఎగువకు చేరేనా?



సిరిసిల్ల: జలాశయాలు.. చెరువులు నీటి ప్రవాహం లేక కళ తప్పాయి. దిగువన గోదావరి జలాలు ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు వచ్చి చేరుతున్నాయి. కాళేశ్వరం లింక్-3లో మధ్యమానేరు నుంచి ఎగువమానేరుకు నీటి తరలింపులో అసంపూర్తి పనులతో సింగసముద్రం వరకు తరలించే వీలుంది. వర్షపాతంలోనూ జిల్లాలో నేటికి 430.7 మి.మీ.లు కురవాల్సి ఉండగా 345.7 మి.మీ. మాత్రమే కురిసింది. మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా ఎక్కడా చెరువులు నిండలేదు. ఈ నేపథ్యంలో జిల్లా సాగునీటి వనరుల్లో నెలకొన్న భిన్న పరిస్థితులపై కథనం.

**దిగువన జలకళ**

గోదావరిలోకి వరదనీరు వచ్చిచేరుతుండటంతో ఎత్తిపోతల ద్వారా నంది పంపుహౌస్ నుంచి మధ్యమానేరుకు నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మధ్యమానేరులో 7.66 టీఎంసీల నీరుంది. ఇది 15 టీఎంసీలు చేరిన తర్వాతే దిగువ మానేరు, అన్నపూర్ణ జలాశయాలకు తరలించే వీలుంది. ఎగువమానేరు జలాశయం సామర్థ్యం రెండు టీఎంసీలు. ప్రస్తుతం దీనిలో నీటి నిల్వ 0.42 టీఎంసీలు మాత్రమే ఉంది. దీనిలోకి వరదనీరు అంతంత మాత్రమే. గతేడాది ఈ సమయానికి జలాశయంలో ఒక టీఎంసీపైన నీరుంది. ఈ ఏడాది చెప్పుకోదగ్గ నీటిధారలే లేవు. ఈ జలాశయం కింద గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలల్లో 40వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం ఆధారపడి ఉంది. మల్లన్నసాగర్ ప్రధాన కాల్వకు యూటీ నుంచి కూడెల్లివాగులోకి నీటిని విడుదల చేయడం ద్వారా ఎగువమానేరుకు నీరు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మల్లన్నసాగర్‌కు నీటి తరలింపే సందిగ్ధంలో ఉంది. జిల్లా మొత్తం 666 చెరువులున్నాయి. వేములవాడ, వేములవాడ గ్రామీణ, కోనరావుపేట మండలాల్లోని 27 చెరువుల్లో మాత్రమే 75శాతం నీరుంది. మిగతా వాటిలో 25శాతం కూడా నీరు చేరలేని పరిస్థితి ఉంది. చందుర్తి మండలంలో అత్యధికం, బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో మాత్రమే సగటుకు మించి వర్షపాతం. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**9వ ప్యాకేజీపైనే ఆశలు**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-3లో ప్రధానమైన తొమ్మిదో ప్యాకేజీలోని మల్కపేట పంపుహౌస్‌లో గతేడాదే మే, జూన్ నెలలో రెండు మోటార్ల ట్రయల్ రన్ ప్రారంభానికి సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో దీని ఊసేలేకుండా పోయింది. మధ్యమానేరులో 15 టీఎంసీల పైన నీరు చేరితే.. వెనక జలాల నుంచి మల్కపేట పంపుహౌస్‌కు నీటిని తరలిండం సులభం అవుతుంది. అక్కడి నుంచి కాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని మైసమ్మ చెరువు, అక్కడి నుంచి గంభీరావుపేటలో సింగసముద్రం చెరువుకు కాల్వ ద్వారా నిటిని తరలించవచ్చు. ఇక్కడి వరకు కాల్వ పనులు పూర్తయ్యాయి. ఫేజ్-2లో సింగసముద్రం నుంచి ముస్తాఫా నగర్‌లో 2 టీఎంసీల సామర్థ్యం ఉన్న బట్టల చెరువులోకి తరలించే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మెట్టప్రాంతం కావడంతో జిల్లాలో జలాశయాలు, చెరువులకు నీరుచేరితే భూగర్భజలాలు నిలకడగా ఉంటాయి. వాటిపైనే పంటల సాగు ఆధారపడుతుంది.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు షురూ




పెద్దపలి : పంచాయతీ ఎన్నికలపై ఆరు నెలల తర్వాత కదలిక వచ్చింది. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇందుకోసం వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణివ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది. దీంతో ప్రతి జిల్లా నుంచి అయిదురు ఆపరేటర్ల వివరాలు పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు వచ్చే నెల 2న శిక్షణ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు పల్లె పోరుపై కసరత్తు ప్రారంభం కావడంతో రాజకీయ నాయకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

**అభివృద్ధిపై ప్రభావం**

పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన జరుగుతోంది. ప్రత్యేక అధికారులు తమ మాతృశాఖ పనులకే పరిమితమవుతూ.. సభలు, సమావేశాలకు వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఏ చిన్న సమస్య వచ్చినా వార్డు సభ్యులు, సర్పంచులను ఆశ్రయించే ప్రజలు ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. నిర్ణీత వ్యవధిలో ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా పల్లె అభివృద్ధిపై ప్రభావం పడుతోంది.

**రిజర్వేషన్లపై చర్చ**

ఉమ్మడి జిల్లాలో 1,213 గ్రామ పంచాయతీలున్నాయి. జగిత్యాలలో 380, పెద్దపల్లి 265, కరీంనగర్ 313, రాజన్న సిరిసిల్ల 255 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆగస్టు మొదటి వారంలోపు ఓటరు జాబితా సిద్ధం చేయాలనే సీఎం ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో ఎన్నికల చర్చ జోరుగా సాగుతోంది. ఆశావాహులు రిజర్వేషన్ల ఖరారుపై తమ అనుచరగణాలతో చర్చిస్తున్నారు.

ప్రతి జిల్లా నుంచి అయిదుగురు ఆపరేటర్లు శిక్షణలో పాల్గొనున్నారు. వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియపై వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఓటరు జాబితా అందింది. దాని ఆధారంగా పంచాయతీ అధికారులు తుది జాబితా సిద్ధం చేస్తారు.

ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకు జనాభా, బీసీలకు ఓటర్ల ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్‌లను అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ మేరకే నిర్వహిస్తుందా.. రిజర్వేషన్లు మారుస్తుందా అన్న సందిగ్ధం నెలకొంది.

# పర్యవేక్షణ లోపం.. స్వచ్ఛతకు విఘాతం

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నానికి పట్టణ శివారు రోడ్ల వెంబడి కొందరు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పారబోస్తూ విఘాతం కలిగిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడం ఇందుకు దోహదపడుతోంది. పట్టణంలోని రెండు బైపాస్ రహదారుల వెంబడి, మూలవాగు, పట్టణ శివారు కాలువలు, మూలవాగు, పట్టణంలోని ఖాళీ స్థలాలు వ్యర్థాలకు నిలయంగా మారాయి. వర్షాకాలం కావడంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

**రూ.20 లక్షలు కేటాయించినా..**

వేములవాడ పట్టణంతో పాటు మరో అయిదు విలీన గ్రామాలను కలుపుకొని 28 వార్డులున్నాయి. ఇందులో పారిశుద్ధ్యం పనులు చేసేందుకు 93 మంది రెగ్యులర్ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు తాత్కాలిక సిబ్బంది పని చేస్తున్నారు. అయినా వార్డుల్లో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్యం పనులు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వానాకాలంలో ప్రతి వార్డులో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు దాదాపు రూ.20 లక్షలు కేటాయించి మున్సిపల్ కార్మికులతోపాటు అదనంగా రోజు పది నుంచి పదిహేను మంది కార్మికులను టెండర్ ద్వారా ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. మురుగు కాలువల వెంబడి గడ్డి తొలగించడం, కాలువల్లో మురుగు తొలగించడం వంటి పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని కాలనీలకే పరిమితమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజు చెత్త వాహనాల ద్వారా 20 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపు యార్డుకు తరలిస్తున్నారు. అయినా కొన్ని వార్డుల్లో చెత్త ఆటోలు రావడం లేదనే ఆరోపణలున్నాయి.

**యథేచ్ఛగా వ్యర్థాల పారబోత**

వేములవాడ పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి చెత్తా చెదారంతోపాటు కోళ్ల వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థాలను యథేచ్ఛగా



పారేయడం పరిపాటిగా మారింది. నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇది నిరాటంకంగా సాగుతోంది. రహదారులపై వ్యర్థాలను పారబోసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో పట్టణ శివారు రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయని, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో రూ.20 లక్షలు వెచ్చించి ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. ఇప్పటికే ఎనిమిది వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు పూర్తయ్యాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్త పారబోసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.- అన్వేశ్, కమిషనర్ మున్సిపల్ వేములవాడ

# దర్జాగా కబ్జా..!

ఆత్మకూర్ : భూగర్భ జలాలను పెంపొందించే ప్రధాన జలవనరులైన చెరువులు, కుంటలు ఏటేటా కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం వేసవి సీజన్‌లో అక్రమార్కులు శిఖం భూములపై కన్నేసి యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ముఖ్యంగా శిఖంలో యంత్రాల సహాయంతో కట్టలు పోసి మడులు తయారు చేస్తున్నారు. దీంతో విశాలంగా ఉండాల్సిన చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. జిల్లాలో శిఖం ఆక్రమణలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకుంటే రాబోయే రోజుల్లో పెద్ద చెరువులూ.. చిన్న, చిన్న కుంటలుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారనుంది. బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి సాగు విస్తీర్ణం తగ్గనుంది.

**ఆక్రమణలు ఇలా..**

మండల కేంద్రంలోని పెద్ద చెరువు శిఖంభూమిలో పొక్లెయిన్‌తో కట్టలు పోసి మడులుగా చేస్తున్నారు. వేసవిలో చెరువులోని తుమ్మచెట్లను కొట్టివేయడమే కాకుండా చుట్టూ శిఖం భూమిని కబ్జా చేశారు. 802 సర్వేనంబరులో గల పెద్ద చెరువు విస్తీర్ణం 256 ఎకరాలు. ఇందులో సుమారు నలభై ఎకరాల వరకు ఆక్రమించి పొలాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదే మండలంలోని గట్టికల్‌లో 143 సర్వే నంబరులో 29.04 ఎకరాల్లో ఊర చెరువు విస్తరించి ఉంది. మట్టితో శిఖం భూములు పూడ్చివేసి ఎకరాలకొద్ది కబ్జా చేశారు. శిఖంలో కట్ట నిర్మించి సిమెంట్ గూనలు వేశారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లలోనే 12 ఎకరాలకు పైగా ఆక్రమించినట్లు చెబుతున్నారు.

నెమ్మికల్‌లోని 484 సర్వే నంబరులో చౌటచెరువు 84 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. మూడేళ్ల క్రితమే శిఖం భూముల ఆక్రమణపై స్థానిక మత్స్యకారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు చౌటచెరువును సర్వే చేసి 25 ఎకరాలు ఆక్రమణకు గురయినట్లు తేల్చారు. బాధ్యులపై తీసుకున్న చర్యలు శూన్యం. ఆక్రమణదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నట్లు గుర్తించారు. మళ్లీ ఈ వేసవిలోనూ తుమ్మచెట్లను కొట్టేసి యంత్రాల సహాయంతో పొలం మడులు తయారు చేశారు.

సూర్యాపేట మున్సిపాలిటీ కుడకుడ కర్నాలకుంట యథేచ్ఛగా కబ్జాకు గురవుతోంది. శిఖం భూముల్లో ప్లాట్లను తయారు చేశారు. దీనిపై పలుమార్లు ఆందోళన నిర్వహించారు. అధికారులు విచారణ చేసినా చర్యలు చేపట్టలేదు.



చివ్వెంల మండలం వల్లభాపురం,అక్కలదేవిగూడెం చెరువు శిఖాలను రైతులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు.

పెన్‌పహాడ్ మండలంలోని రంగయ్యగూడెం చెరువు, యల్లప్పకుంట చెరువు శిఖాలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువు లోపలికి చొచ్చుకొచ్చి పొలాలు సేద్యం చేస్తున్నారు.

జిల్లాలో ఐబీ లెక్కల ప్రకారం చెరువులు, కుంటల వివరాలు..

వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగినవి: 166 ఆయకట్టు: 36,776 ఎకరాలువంద ఎకరాల లోపు ఉన్న కుంటలు: 870 ఆయకట్టు: 32,609 ఎకరాలుఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నాం

శివధర్మతేజ, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, సూర్యాపేట

చెరువుల ఆక్రమణపై ఇటీవల కలెక్టర్‌తో నిర్వహించిన సమావేశంలో చర్చించాం. సూర్యాపేట పట్టణం వరకు ఒక కమిటీ వేశాం. చెరువులు, కుంటల్లో పాత ఎఫ్‌టీఎల్ ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. శిఖం భూములను ఆక్రమించే రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాం. కబ్జాపై ఫిర్యాదు అందిన సత్వరమే చర్యలు తీసుకుంటాం.

# గ్రామానికో పోలీస్..!

నల్గొండ : పల్లె నుంచి పట్టణం వరకు ఎక్కడ అవినీతి, అక్రమాలు జరిగినా.. పూర్తి స్థాయి సమాచారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి చేరేలా పోలీస్ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. గ్రామీణ పోలీస్ వ్యవస్థను (వీపీవో) మరింత పటిష్ఠం చేయడంతో పాటు నేర రహిత జిల్లాగా మార్చేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రణాళికలు సిద్ధం చేశారు. పదేళ్ల క్రితం ఉన్న విలేజ్ పోలీస్ వ్యవస్థను తిరిగి జిల్లాలో నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే మూడు డివిజన్‌లలో ఏడు గ్రామాలకు పోలీస్ అధికారులను ఎంపిక చేశారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు జరగనున్నాయి. గ్రామానికి ఒకరు, పట్టణాల్లో వార్డుకు ఒక పోలీస్ అధికారిని ఎంపిక చేసి ప్రధాన కూడళ్లలో వారి చరవాణి నంబర్లు ప్రదర్శిస్తారు. వీరు ఆయా ప్రాంతాల్లో పాత నేరస్థుల కదలికలతో పాటు సంఘవిద్రోహ శక్తుల వివరాలు సేకరిస్తారు. స్థానికంగా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చూపడంతో పాటు పైస్థాయి అధికారులకు నివేదిస్తారు. గంజాయి, నిషేధిత గుట్కా, బెల్టుషాపులు, రోడ్డు ప్రమాద నివారణ మార్గాలు, దొంగతనాలు, పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గుడుంబా తయారీపై నిఘా పెట్టడంతో పాటు పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించనున్నారు.

జిల్లాకు చేరిన నార్కోటిక్ కిట్లు..

గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి నేటి నుంచి ప్రత్యేక ఏర్పాట్లను ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు గంజాయి తాగితే నిర్ధారించే నార్కోటిక్ యంత్రాలు (ఒక్కోటి రూ.600 ఖర్చుతో) పది చొప్పున అందజేశారు. వీటితో పాటు ఒక నార్కోటిక్ డాగ్ (మత్తుపదార్థాలను గుర్తించే శునకం)కు శిక్షణ ఇచ్చి పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక గదిలో అందుబాటులో ఉంచారు. ఏవోబీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలతో పాటు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో నిఘా పెంచనున్నారు.

నేటి నుంచి అవగాహన సదస్సులు..

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన 60 మందిని గుర్తించారు. వారితో పాటు వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించనున్నారు. స్టేషన్ల వారీగా పాత నేరస్థుల కదలికలపై అప్రమత్తత పెంచనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు తెలిపారు. సమాచారం ఇచ్చే వారు వాట్సప్ చరవాణి నెంబర్ 87126 70426ను సంప్రదించాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



# పారాలింపిక్స్ విజేతలతో ప్రధాని మోదీ ఆత్మీయ సమావేశం..

పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్ భారత అథ్లెట్లు సత్తా చాటారు. మొత్తం 29 పతకాలను సాధించారు. స్వదేశానికి చేరుకున్న విజేతలతో ప్రధాని మోదీ దిల్లీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. అథ్లెట్లను అభినందించారు. దేశం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు.

ఈ సందర్భంగా వారితో కాసేపు ముచ్చటించారు. 'అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన భారత అథ్లెట్లు 29 పతకాలను సాధించడం అభినందనీయం. వారి అంకితభావంతోనే ఇది సాధ్యమైంది. ఎంతోమందికి ఇది స్ఫూర్తిదాయకం" అని ఎక్స్‌లో ప్రధాని మోదీ ప్రశంసించారు. తాజాగా అథ్లెట్లతో మోదీ ముచ్చటిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ భేటీలో కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) హెడ్ దేవేంద్ర జజారియా కూడా పాల్గొన్నారు. పారాలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో స్వర్ణం సాధించిన హర్విందర్ సింగ్.. ప్రధానితో జరిగిన సమావేశంలోని విశేషాలను మీడియాతో పంచుకున్నాడు. "ప్రధాని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. మా బృందాన్ని ప్రశంసించారు. క్రీడా సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నా బాణాన్ని ప్రధానికి బహుమతిగా ఇవ్వడం సంతోషంగా ఉంది" అని పంచుకున్నాడు. కాగా.. ఇటీవల పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత్ అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఏకంగా 29 పతకాలు సాధించి ఔరా అనిపించారు. ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్‌లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి. 2020లో నిర్వహించిన టోక్యో పారాలింపిక్స్‌లో 5 స్వర్ణాలు సహా 19 పతకాలను భారత్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ సారి అంతకు మించి పతకాల పంట పండించింది.




# ప్రకాశం జిల్లా వైసీపీలో కలకలం.. జనసేనలోకి కీలకనేత..

ప్రకాశం: ప్రకాశం జిల్లా వైసీపీలో కలకలం రేగుతోంది. అసలే వైసీపీ పరిస్థితి గాలిలో దీపం మాదిరిగా ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఒకప్పుడు పార్టీకి అండదండగా ఉన్న నేత పార్టీ మారబోతున్నారంటూ ఒక్కసారిగా వార్తలు గుప్పుమన్నాయి. దీంతో వైసీపీలో ఉత్కంఠ ప్రారంభమైంది. ఏం జరుగుతుందోనన్న టెన్షన్ వైసీపీ నేతల్లో వ్యక్తమవుతోంది. వైసీపీ అధినేత జగన్ పై పార్టీ కీలక నేత బాలినేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తితో ఉన్నట్టుగా సమాచారం. వాస్తవానికి తనను కాదని పార్టీ జిల్లా పదవులు ఇతర నేతలకు అప్పగించినా ఆయన పెద్దగా పట్టించుకోలేదు. జగన్ అపాయింట్‌మెంట్ ఇవ్వకున్నా.. ఎన్ని అవమానాలు జరిగినా పార్టీ వీడే ఆలోచన మాత్రం చేయలేదు.

కానీ ఇప్పుడు బాలినేనిలో ఓపిక నశించినట్టుంది. ఈ క్రమంలోనే నిన్న రాత్రి తాడేపల్లిలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో బాలినేని భేటీ అయ్యారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించి పార్టీని బలోపేతం చేయాలని బాలినేనిని వైఎస్ జగన్ కోరినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాలినేని.. తనకు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే ఉద్దేశ్యం లేదని ఖరాఖండీగా చెప్పేసినట్టు సమాచారం. ఈవీఎంల వ్యవహారంలో పార్టీ అధిష్టానం సహకరించలేదని జగన్ ఎదుట బాలినేని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా వైసీపీ అధిష్టానం తనకు సహకరించడం లేదని బాలినేని అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాల్లో జగన్, బాలినేని మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఎన్నికలకు ముందు కొంతకాలం పాటు బాలినేని పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల సమయంలో తిరిగి పార్టీకి దగ్గరయ్యారు. పార్టీకి అండగా నిలిచారు. ఎన్నికలైన తర్వాత కూడా ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. దీంతో ఇప్పుడు జగనే స్వయంగా పిలిచి జిల్లా వ్యవహారాలు చూడాలని చెప్పినా కూడా కుదరదని తేల్చి చెప్పేశారట. అనంతరం బాలినేని తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. అయితే బాలినేని.. జనసేన, బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా జనసేన నేత నాగేంద్రబాబుతో టచ్‌లో ఉన్నారని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపిన అనంతరం జనసేనలో బాలినేని చేరికపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# సీతారాం ఏచూరి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం



అమరావతి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈ రోజు(గురువారం) మృతిచెందారు. ఆగస్టు 19వ తేదీన శ్వాసకోశ సమస్యలతో ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే సీతారాం ఏచూరి మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏచూరి భారతదేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తులల్లో ఒకరని తెలిపారు.

కింది స్థాయి నుంచి ఎదిగారని గుర్తుచేసుకున్నారు. అతని ఆలోచనలు సీపీఎం పార్టీకి ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టాయని అన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులు, సహచరులు, అనుచరులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఏలేరు ఆధునికీకరణను జరగకపోవడం వల్లే ఇంతటి విపత్తు





కాకినాడ, సెప్టెంబర్ 12: ఏలేరు వరదతో వందల ఎకరాల్లో నష్టం జరిగిందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఏలేరు ఆధునికరణ జరగకపోవడం, పూడిక తియ్యకపోవడం వల్లే ఇంతటి విపత్తు ఏర్పడిందన్నారు. రైతులు అప్పులు చేసి పంట వేసి నష్టపోయారన్నారు. ప్రతి ఎకరాకు 30వేల చొప్పున రైతు ఖర్చు పెట్టాడని తెలిపారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయంలో ఏలేరు ఆధునీకరణకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభు త్వాలు ఏలేరు ఆధునీకరణను విస్మరించాయని విమర్శించారు. జగన్ ఏలేరు ఆధునికరణను చేయకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# శానిటేషన్‌పై మంత్రి నారాయణ కీలక ఆదేశాలు



విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన శానిటేషన్ పనులపై సంబంధిత అధికారులకు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి నారాయణ ఈరోజు(గురువారం) వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పాయకాపురం, ఉడా కాలనీ, జర్నలిస్టు కాలనీ, కండ్రిక, ఆంబాపురంలో బాధితులను పరామర్శించి వారికి అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో స్వల్పంగా ఉన్న వరద నీటిని బయటకు పంపింగ్ చేయడంపై అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడారు. పాయకాపురం నుంచి ముస్తాబాద్ వరకూ బుడమేరు ప్రవహించే మార్గాన్ని పరిశీలించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని త్వరితగతిన బుడమేరులోకి తరలించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. విజయవాడలో మొత్తం 32 డివిజన్లలో నీరు దాదాపు తగ్గిపోయిందని తెలిపారు. ఒకటి రెండు డివిజన్లలో వరద నీరు కొద్దిగా నిల్వ ఉందని చెప్పారు. నీటిని బయటకు పంపింగ్ చేసేందుకు అవసరమైన చోటా రోడ్లకు గండ్లు కొడుతున్నామని అన్నారు. రేపు(శుక్రవారం) సాయంత్రానికి మొత్తం నీరు బయటకు పంపింగ్ చేస్తామని వెల్లడించారు. అన్ని డివిజన్లలో శానిటేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తుందని అన్నారు. వరద ప్రాంతాల్లో సాధారణ పరిస్థితి వస్తుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# నూతన పార్లమెంటులో టీడీపీ పార్లమెంటరీ పార్టీకి నూతన కార్యాలయం



ఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీకి నూతన పార్లమెంటులో నూతన కార్యాలయం కేటాయించారు. ప్రస్తుత లోక్‌సభలోని వివిధ పార్టీలకు పార్లమెంటరీ పార్టీ కార్యాలయాల కేటాయింపులో భాగంగా టీడీపీకి కేటాయింపు జరిగింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పార్లమెంటు మొదటి అంతస్తులో తెలుగుదేశం పార్టీకి కార్యాలయం ఇచ్చినట్టు తెలిపింది. మొదటి అంతస్తులోని ఎఫ్09 నుంచి ఇకపై టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. నూతన పార్లమెంటు మొదటి అంతస్తులో ప్రధాని, కేంద్ర మంత్రుల కార్యాలయాలు ఉన్నాయి. గతంలో పాత పార్లమెంటులో (సంవిధాన్ సదన్) టీడీపీపీ కార్యాలయం ఉండేది. కాగా పాత పార్లమెంటు ప్రాంగణంలో ఇప్పటికీ కొనసాగుతున్న కార్యాలయాలలోనే ఇక ముందు కూడా కొనసాగేందుకు అనేక పార్టీల మొగ్గు చూపాయి. దీంతో ఆయా పార్లమెంటరీ పార్టీల విజ్ఞప్తి మేరకు బీజేపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్ యునైటెడ్ సహా పది పార్టీలకు ఆ కార్యాలయాలనే లోక్ సభ సెక్రటేరియట్ కేటాయించింది.

# తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. నలుగురి దుర్మరణం




చంద్రగిరి: తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో కంటైనర్ లారీ అదుపుతప్పి కారు, బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# వైసీపీ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూస్తున్నారు.. టీడీపీ సీనియర్ సంచలన వ్యాఖ్యలు



విశాఖపట్నం: వైసీపీకి ఉన్న 11 మంది ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నారని, కూటమి గేట్లు ఎత్తేస్తే వైసీపీలో జగన్ ఒక్కరే మిగులుతారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. అరాచకాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించినా.. జగన్‌లో ఇంకా మార్పు రాలేదు అని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేస్తున్న కూటమి సర్కార్‌ను బర్తరఫ్ చేయాలని, రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేయడం వింతగా అనిపిస్తోందని అన్నారు. తన పార్టీని ఘోరంగా ఓడించినందుకు ప్రజలపై జగన్ కక్ష తీర్చుకుంటున్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ వరద బాధితులను ఆదుకున్నారని, రూ.4 కోట్ల విరాళం ప్రకటించారని, అయినా సరే ఆయనపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని గంటా శ్రీనివాస రావు అన్నారు. జగన్ లాగా పవన్ కల్యాణ్‌కి లక్షల కోట్లు రూపాయల అక్రమ సంపాదన లేదని అన్నారు. కోట్లాది రూపాయలు ఆస్తులున్న జగన్.. కేవలం కోటి రూపాయలే విరాళం ప్రకటించారని విమర్శించారు. వరద బాధితులను ఆదుకోకుండా.. జైలులో ఉన్న పార్టీ నేతలను పరామర్శిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బాధితులకు ప్రభుత్వం చేస్తున్న సహాయంపై లేనిపోని విమర్శలు చేస్తే జగన్ చరిత్రహీనులుగా మారుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జగన్ మోహన్ రెడ్డికి నదికి, వాగుకి మధ్య తేడా తెలియటం లేదు. ఎవరు స్క్రిప్ట్ రాసిస్తున్నారో తెలియదు గానీ బుడమేరు నది అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు" అని గంటా శ్రీనివాస రావు పంచులు పేల్చారు.




విజయనగరం జిల్లా: రామభద్రాపురంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనం ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపై ఎస్కార్టు వాహనం టైరు పేలిపోయింది. దీంతో అదుపు తప్పిన వాహనం వ్యాన్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ముగ్గురుతోపాటు ముగ్గురు గన్‌మెన్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. మంత్రి సంధ్యారాణి గురువారం విజయనగరం జిల్లా, రామభద్రాపురం, మెంటాడ మండలంలోని అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి బయలుదేరారు. ఈ క్రమంలో రామభద్రాపురం దాటిన తర్వాత ఆరికతోట సమీపంలో మంత్రి ఎస్కార్ట్ వాహనం ఫ్రంట్ టైర్ పేలిపోయింది. ఈ దశలో ముందు వెళుతున్న వ్యాన్‌ను ఎస్కార్టు వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గన్‌మెన్‌లు, వ్యాన్‌లో ఉన్నవారు గాయపడ్డారు. ఇద్దరు గన్‌మెన్‌ల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను విజయనగంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ ప్రమాద ఘటనలో మంత్రి సంధ్యారాణికి తృటిలో ప్రమాదం తప్పింది.

అయితే మంత్రి సంధ్యారాణి ఎస్కార్టు వాహనం వెనుక మంత్రి ప్రయాణిస్తున్న వాహనం ఉంది. ముందు ఎస్కార్ట్ వాహనం ప్రమాదానికి గురికావడంతో మంత్రి ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని పక్కకు మళ్లించారు.

దీంతో మంత్రికి ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు జాతీయ రహదారిపై రాకపోకలు తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా రోడ్ ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్కార్ట్ పోలీసులను మంత్రి సంధ్యారాణి పరామర్శించారు.

## దేవర కోసం తంగం అందాల షో

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర' సినిమాలో అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించిన విషయం తెల్సిందే. రికార్డ్ స్థాయి బడ్జెట్ తో నందమూరి ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరిని మెప్పించే విధంగా దర్శకుడు దేవర సినిమాను రూపొందించినట్లు చెబుతున్నారు. ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న దేవర సినిమా ప్రమోషన్ లో జాన్వీ కపూర్ యాక్టివ్ గా కనిపిస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి నటన ప్రతిభ ఉన్న జాన్వీ కపూర్ కి దేవర మొదటి కమర్షియల్ బ్రేక్ ను ఇవ్వబోతున్నట్లుగా ఆమె ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. దేవర లో తంగం పాత్రలో జాన్వీ కపూర్ కనిపించబోతుంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటల్లో ఎన్టీఆర్ తో సమానంగా డాన్స్ చేస్తూ, అందాల ఆరబోత చేసిన జాన్వీ కపూర్ చూపు తిప్పుకోనివ్వలేదు. తాజాగా మరోసారి దేవర కోసం అంటూ తన అందాల ఫోటోలను షేర్ చేసింది. దేవర పాటల కోసం, సీన్స్ కోసం జాన్వీ కపూర్ అందమైన ఔట్ ఫిట్ తో కనిపించింది. అందుకు సంబంధించిన ఫోటోలను ఇలా షేర్ చేసిన జాన్వీ కపూర్ నెట్టింట వైరల్ అయింది. సాధారణంగానే జాన్వీ కపూర్ ఫోటో షూట్స్ వైరల్ అవుతాయి. ఈసారి దేవర సినిమాలోని స్టిల్స్ ను ఆమె షేర్ చేయడం



ద్వారా చూపు తిప్పనివ్వడం లేదు. సాధారణంగా ఎన్టీఆర్ పక్కన ఏ హీరోయిన్ ఉన్నా తక్కువే అనిపిస్తూ ఉంటుంది. ఆయన ఇమేజ్ ముందు పెద్ద హీరోయిన్స్ కూడా చిన్న పోతారు. అలాంటిది జాన్వీ కపూర్ మాత్రం తన అందంతో దృష్టి తనవైపుకు తిప్పుకుంటుంది. ఈ స్థాయిలో అందం కేవలం జాన్వీ కపూర్ కే సాధ్యం అయిందంటూ నెట్టింట కామెంట్స్ వస్తున్నారు. ఆకట్టుకునే అందం తో జాన్వీ కపూర్ దేవర లో కనిపించనున్నట్లుగా ఈ ఫోటోలు షేర్ చేసింది. ఎన్టీఆర్ గత చిత్రం ఆర్ఆర్ఆర్ భారీ విజయాన్ని సొంతం చేసుకున్న కారణంగా దేవర సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. నేడు జాన్వీ కపూర్ తో కలిసి ముంబైలో జాతీయ మీడియా సమక్షంలో దేవర ట్రైలర్ ను ఎన్టీఆర్ రిలీజ్ చేయబోతున్నాడు. గతంలో సీనియర్ ఎన్టీఆర్, శ్రీదేవిల జంట కు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉ ఒడేది. ఇప్పుడు ఆయన మనవడు ఎన్టీఆర్, శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ కాంబో లో సినిమా వస్తున్న నేపథ్యంలో అందరూ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురు చూస్తున్న వారికి కచ్చితంగా విందు భోజనం మాదిరిగా గేమ్ ఛేంజర్ ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

## మోక్షజ్ఞ రెమ్యునరేషన్.. నిజంగా అంత ఇస్తున్నారా?

నందమూరి నటసింహం బాలయ్య వారసుడిగా మోక్షజ్ఞ టాలీవుడ్ లోకి గ్రాండ్ గా ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ మూవీ అఫీషియల్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో మొదలు కాబోతోంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా సూపర్ హీరో కథాంశంతోనే ఈ చిత్రం ఉండబోతోందని తెలుస్తోంది. అయితే ఈ మూవీ అసలు స్టోరీ ఏంటనేది బయటకి రాలేదు. అభిమాన్యుడి క్యారెక్టర్ బేస్ చేసుకొని ప్రశాంత్ వర్మ మోక్షజ్ఞ కోసం కథని సిద్ధం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాని సుధాకర్ చెరుకూరి, తేజస్విని నందమూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాలయ్య చిన్న కూతురు తేజస్విని నిర్మాతగా మోక్షజ్ఞ సినిమాతో ప్రయాణం మొదలు పెట్టబోతున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోందంట. మోక్షజ్ఞకి



జోడీగా ఈ చిత్రంలో ఎవరిని ఎంపిక చేస్తారనే క్యూరియాసిటీ ఫ్యాన్స్ లో ఉంది. ఇదిలా ఉంటే ఈ సినిమా గురించి ఇంటరెస్టింగ్ టాక్ సోషల్ మీడియాలో నడుస్తోంది. ఈ చిత్రం కోసం మోక్షజ్ఞకి నిర్మాతలు ఏకంగా 20 కోట్ల రెమ్యునరేషన్ ఇస్తున్నారంట. ప్రస్తుతం ఇదే ఇండస్ట్రీ హాట్ టాపిక్ గా మారింది. టాలీవుడ్ లో స్టార్స్ వారసులుగా ఎంట్రీ ఇచ్చిన ఏ ఒక్క హీరో కూడా డెబ్యూ మూవీతో ఈ స్థాయిలో రెమ్యునరేషన్ తీసుకోలేదు. ఒక టైర్ 2 హీరోకి ఇచ్చే రేంజ్ లో మోక్షజ్ఞకి ఈ చిత్రం కోసం రెమ్యునరేషన్ ఇవ్వడం అంటే అది కచ్చితంగా రికార్డ్ అని చెప్పొచ్చు. అయితే ఈ రెమ్యునరేషన్ పై జరుగుతోన్న ప్రచారంలో వాస్తవం ఎంత అనేది మాత్రం తెలియదు. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ గానే ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే మోక్షజ్ఞ హీరోగా తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకోవడానికి కావాల్సిన అన్ని రకాల శిక్షణ తీసుకున్నారంట. యాక్టింగ్, డాన్స్ పరంగా మంచి టాలెంట్ ఉందనే మాట వినిపిస్తోంది. మొదటి చిత్రం అయిన మోక్షజ్ఞ నటనతో అందరిని మెస్మరైజ్ చేయడం గ్యారెంటీ అని నందమూరి ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు. ఆయన మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే తెరపై చాలా స్టైలిష్ గా కనిపించబోతున్నాడని అర్ధమవుతోంది. మరి మోక్షజ్ఞకి ఈ మూవీ ఎలాంటి ఇమేజ్ తీసుకొస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. త్వరలో ఈ సినిమాకి సంబందించిన క్యాస్టింగ్ అండ్ క్రూని ప్రకటించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది.





## రంగంలోకి నాగ్.. సైమన్ గా ఛార్జ్!




టాలీవుడ్ కింగ్ నాగార్జున.. తనదైన శైలిలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు వేరే హీరోల చిత్రాల్లో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రస్తుతం శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న కుబేర మూవీలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే నాగ్ కు సంబంధించిన పోస్టర్లు మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. రీసెంట్ గా కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ మూవీలోని కీలక పాత్ర కోసం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రముఖ తమిళ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న కూలీ మూవీలో నాగార్జున.. సైమన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయాన్ని నాగ్ బర్త్ డే రోజు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అందులో నాగార్జున పూర్తి డిఫరెంట్ లుక్ లో కనిపించారు. ఒక చేతికి గోల్డెన్ కలర్ వాచ్ పెట్టుకుని సీరియస్ గా ఉన్నారు. మరో చేతిలో రెడ్ కలర్ స్కార్ఫ్ తో ఇంట్రెస్ట్ పెంచారు. మొత్తానికి చాలా రోజుల తర్వాత నాగ్ రగ్డ్ లుక్ కొత్తగా అనిపిస్తుంది. అయితే నాగార్జున.. ఇప్పుడు కూలీ మూవీ కోసం రంగంలోకి దిగారు. రీసెంట్ గా సెట్స్ లో జాయిన్ అయ్యారు. 40 రోజుల పాటు సాగనున్న కొత్త షెడ్యూల్ ఇటీవల వైజాగ్ లో స్టార్ట్ అయింది. ఇప్పుడు నాగార్జున కూడా షూటింగ్ లో పాల్గొంటున్నారు. మేకర్స్.. రజనీకాంత్, నాగ్ పై కొన్ని కీలకమైన సీన్లను షూట్ చేయనున్నారు. ఈ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సైమన్ ఆన్ ఛార్జ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక కూలీ మూవీలో నాగ్ రోల్ చాలా పవర్ ఫుల్ గా ఉండనున్నట్లు కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు గాను భారీ మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఏకంగా 20 కోట్ల రూపాయలకు పైగా పారితోషికం అందుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన కెరీర్ లో ఇదే హైయెస్ట్ రెమ్యునరేషన్ అని టాక్ వినిపిస్తోంది. ఇందులో నిజమెంత ఉందో మాత్రం తెలియదు. అయితే గోల్డ్ మాఫియా బ్యాక్ డ్రాప్ తో యాక్షన్ డ్రామాగా కూలీ మూవీని లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. సౌబిన్ షాహిర్, శృతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్ తో సన్ పిక్చర్స్ నిర్మిస్తుండగా.. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది పాన్ ఇండియా రేంజ్ లో మూవీని రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. మరి కూలీ ఎప్పుడు విడుదల అవుతుందో వేచి చూడాలి.

## శర్వా 37: సమ్యూక్తా 'దియా' అవతారం




టాలీవుడ్‌లో స్టార్ హీరో శర్వానంద్ 37వ సినిమా ప్రస్తుతం గ్యాప్ లేకుండా షూటింగ్ జరుపుకుంటోంది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మాణం చేస్తున్న ఈ చిత్రం ఒక సరికొత్త స్టోరీ లైన్ తో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'సమజవరగమన' లాంటి హాస్యప్రధానమైన చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న రామ్ అబ్బరాజు, ఈ సినిమా ద్వారా మరొక ఫన్ రైడ్‌కు సిద్ధమవుతున్నాడు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. సాక్షి వైద్య, సంయుక్త ఇందులో హీరోయిన్లుగా కనిపించనున్నారు. సంయుక్త పుట్టిన రోజు సందర్భంగా, ఆమె పాత్రకు సంబంధించి 'దియా' అనే పాత్ర పరిచయం చేస్తూ ప్రత్యేక పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో సంయుక్త సంప్రదాయ నృత్య దుస్తుల్లో, రెండు దీపాలతో తన అద్భుతమైన నర్తన శైలిని చూపిస్తూ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఆమె చేతిలో ఉన్న దీపాల కాంతిలో ఆమె అందం మరింత వెలుగుతుండటంతో, ఆమెకు చెందిన పాత్రపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేలా ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో భాగమైన సాంకేతిక నిపుణుల బృందం కూడా విశేషమైనది. విశాల్ చంద్ర శేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, జ్ఞాన శేఖర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. భాను బోగవరపు కథను అందించగా, నందు సవిరిగాణా డైలాగ్స్ రాశారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక, నిర్మాతల విషయానికి వస్తే అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. ఈ చిత్రం కేవలం కామెడీ తో మాత్రమే కాకుండా శర్వానంద్ కేరెక్టర్‌లో ఒక న్యూ డిఫరెంట్ మూవీ అని మేకర్స్ చెబుతున్నారు. శర్వానంద్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, సినీ ప్రేమికులు కూడా ఈ సినిమాలోని ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్ కాంబినేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక, సంయుక్త 'దియా' పాత్రతో ఈ సినిమాలో అందమైన స్థానం సంపాదించుకోనుందని అనిపిస్తోంది. ఇండస్ట్రీలో సంయుక్త జెట్ స్పీడ్ లో క్రేజ్ అందుకుంది. విరుపాక్ష సక్సెస్ అనంతరం ఆమెకు అవకాశాలు మరింత పెరిగాయి. ఇక ప్రస్తుతం శర్వా సినిమాతో పాటు హిందీ, మలయాళంలో కూడా సినిమాలు చేస్తోంది. నిఖిల్ తో చేస్తున్న స్వయంభూ పాన్ ఇండియా ప్రాజెక్టుగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరి ఆ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## లండన్ వీధుల్లో రాశీ ఖన్నా దుమారం

టాలీవుడ్ టు బాలీవుడ్ రాశీఖన్నా జర్నీ గురించి తెలిసినదే. ఇక్కడ అడపాదడపా అవకాశాలు అందుకుంటున్న రాశీ ఇటీవల హిందీ చిత్రసీమపైనా గురి పెట్టింది. అక్కడ షాహిద్ లాంటి స్టార్ సరసన నటించింది. పెద్ద తెర, ఓటీటీ రెండు చోట్లా అవకాశాలు అందుకుంటూ కెరీర్ ని బ్యాలెన్స్ చేస్తోంది. మరోవైపు తమిళంలోను ఈ బ్యూటీ నటిస్తోంది. హిందీలో వరుసగా ప్రయోగాలు చేస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ట్వల్త్ ఫెయిల్ నటుడు విక్రాంత్ మాస్సేతో కలిసి మరో ప్రయోగాత్మక చిత్రంలో నటిస్తోంది. ఇది నిజ ఘటనల ఆధారంగా రూపొందుతోంది.గుజరాత్ అల్లర్లు, గోద్రాలో సబర్మతి ట్రెయిన్ దహనం నేపథ్యంలో రూపొందుతున్న ది సబర్మతి రిపోర్ట్



తన కెరీర్ లో పెద్ద మలుపునిస్తుందని రాశీ భావిస్తోంది. గోద్రా సంఘటన, గుజరాత్ అల్లర్ల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గతంలో IPS ఆఫీసర్ మనోజ్ శర్మగా నటించిన విక్రాంత్ మాస్సే ది సబర్మతి రిపోర్ట్‌లో హిందీ జర్నలిస్ట్‌గా నటిస్తున్నాడు. విక్రాంత్– రాశితో పాటు, జవాన్ నటుడు రిద్ధి డోగ్రా కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం 3 మే 2024న భారీ స్క్రీన్ లలో విడుదల కానుంది. షాహిద్ తో యోధ తర్వాత రాశీకి ఇది మరో క్రేజ ఆఫర్. మరోవైపు తెలుగులో తెలుసు కదా, తమిళంలో మేధావి చిత్రాల్లోను రాశీ నటిస్తోంది. టిఎంఇ అనే హిందీ చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది. ఈ సినిమాలన్నీ రిలీజ్ లకు వచ్చే లోపు రాశీ వరుస ఫోటోషూట్లతో సోషల్ మీడియాల్లో అభిమానులకు టచ్ లో ఉంటోంది. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో గుబులు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం లండన్ ట్రిప్ నుంచి కొన్ని అరుదైన క్లిక్స్ ని షేర్ చేస్తోంది. అక్కడ మిట్ట మధ్యాహ్నం విహారంలో ఉన్నప్పటి ఫోటోగ్రాఫ్ ఒకటి అంతర్జాలంలోకి వచ్చింది. పూర్తిగా ఉలెన్ కోట్ తో కప్పుకుని, రాశీ స్టైలిష్ లుక్ లో కనిపించింది. లండన్ లో చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ఈ భామ స్పెషల్ కేర్ తీసుకుంటోందని అర్థమవుతోంది. లండన్ లో రాశీ రియల్ క్వీన్ ని తలపిస్తోందంటూ అభిమానులు ఈ లుక్ కి కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

## కవర్ పేజీపై బెబో హాలిట్ షో!

బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ ఖాన్ గ్లామర్ ఛామ్ గురించి చెప్పేదేముంది. 43 ఏళ్ల వయసులోనూ కరీనా కవ్వింపు పీక్స్ లోనే ఉంటుంది. టోన్డ్ బాడీ లుక్ లో ఎప్పటికప్పుడు సమ్ థింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. నవతరం నాయికలకు పోటీగా నిలుస్తుంది. జిమ్–యోగా వంటి ఫిట్ నెస్ చర్యలతో ఆఛామ్ ని కంటున్యూ చేయగల్గుతుంది. 40 ప్లస్ లోనూ ధగధగలాడిపోతుంది. నవ నాయికలకు సైతం నా ముందు తగ్గాల్సిందే అంటుంది. తాజాగా అమ్మడు బజార్ ఇండియాపై మెరిసిన వైనం ఎంతో ఆకర్షణీయం. పసుపు వర్ణం ఫ్లోరల్ డిజైన్ లో అమ్మడు సంథింగ్ స్పెషల్ గా ట్రై చేసింది. చీరను పోలిన డిజైన్ లో రెగ్యులర్ ఫోజులకు భిన్నంగా హైలైట్ అవుతుంది. నేలను తాకిన చీర షోల్డర్ కొలతలో ముగింపు




లేకుండా కరీనా హైట్ ని మించి గాల్లోకి ఎగిరిన సారీ ఇది. ఇందులో అమ్మడి సింగిల్ థై షో హైలైట్. థై అందాన్ని ఫోకస్ చేయడమే పనిగా ఈ డిజైన్ హైలైట్ అవుతుంది. ఎలాంటి బ్లౌజ్ లేకుండా టాప్ టూ బాటమ్ చీరతోనే అమ్మడిని అలంకరించారు. ఇక చెవులకు ధరించిన గవ్వల జోడీ అంతే ఇంట్రెస్టింగ్. ఆమెలో బ్యూటీని మరింత రెట్టింపు చేసింది. మ్యాకప్..ఇతర యాక్సరసీస్ ప్రతీది కత్రినా మరింత అందంగా ఫోకస్ చేస్తున్నాయి. అనైతా ష్రాఫ్ కత్రినాని ఇలా స్టైలిష్ గా తీర్చి దిద్దారు. ప్రస్తుతం ఈఫోటో నెట్టింట వైరల్ గా మారింది. కరీనా కెరీర్ సంగతి చూస్తే! బాలీవుడ్ కి ఎంత మంది భామలు దిగొచ్చినా అమ్మడికి పోటీ అనేదే లేదు.

ఇటీవలే ది క్రూతో మరో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. సినిమా మంచి లాభాలు తేవడంతో అదే కాంబినేషన్ మరో సినిమాకి సన్నాహాలు చేస్తోంది. అలాగే సింగం ఎగైన్ లోనూ కరీనా కీలక పాత్ర పోషిస్తుంది. కాఫ్ స్టోరీలో కరీనా మార్క్ పడుతుందని అంచనాలున్నాయి.



## పొలిటికల్ హీట్..
# కౌశిక్‌రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ

హైదరాబాద్: ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి సవాళ్లు, ప్రతిసవాళ్లతో తెలంగాణలో పొలిటికల్ హీట్ నెలకొంది. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. పెద్ద ఎత్తున తన అనుచరులతో బయల్దేరి వెళ్లారు. గాంధీ ఇంటికి వెళ్లి భారాస కండువా కప్పుతానని ఇటీవల కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఎన్నికల్లో గెలిపించకపోతే చనిపోతానని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తన ఇంటికి ఆయన రాకపోతే.. తానే ఆయన ఇంటికి వెళతానని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కొంతమంది అరెకపూడి అనుచరులు కౌశిక్‌రెడ్డి ఇంటి గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నించారు.

**అక్కడే బైఠాయించిన అరెకపూడి గాంధీ.. అరెస్ట్...** కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద తన అనుచరులతో కలిసి అరెకపూడి గాంధీ బైఠాయించారు. పోలీసులు ఆయన్ను పంపించే ప్రయత్నం చేయగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిని బయటకు పిలవాలని.. లేదంటే తననే లోపలికి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అరెకపూడి గాంధీ అనుచరుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరు అనుచరులు గేటు తోసుకుంటూ కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకుముందు అరెకపూడి గాంధీ మీడియాతో మాట్లాడారు. భారాసలోకి వచ్చినప్పటి నుంచి కౌశిక్‌రెడ్డి తీరు సరిగా లేదన్నారు. ఆయన తీరు వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందని విమర్శించారు.

ఆయన కోవర్టుగా వ్యవహరించారన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యక్తిత్వం తెలుసుకోకుండా భారాసలో స్థానం కల్పించారని మండిపడ్డారు. ఆయన ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.



## రూ. వేలకోట్ల ట్రేడింగ్ స్కామ్..
# నటి అరెస్టు

గువాహటి: అస్సాంలో కలకలం సృష్టించిన ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ స్కామ్‌లో ఒక నటిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నటి సుమిబోరా, ఆమె భర్త తార్కిక్ బోరాను అదుపులోకి తీసుకుందని పోలీసులు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ కేసులో వీరిపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో తాజాగా వారి అరెస్టు చోటుచేసుకుంది. అస్సాం పోలీసులు ఇటీవల రూ.2 వేల కోట్ల కుంభకోణం గుట్టు రట్టు చేశారు. పెట్టుబడిని రెట్టింపు చేస్తామంటూ స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరిట ప్రజల నుంచి మోసగాళ్లు సొమ్మును సమీకరించారు. ఈ కేసులో ఇప్పటికే విశాల్ ఫుకాన్‌ను అరెస్టు చేశారు. 60 రోజుల్లో పెట్టుబడులపై 30 శాతం రాబడి వస్తుందని విశాల్ నమ్మబలికాడు. నాలుగు నకిలీ సంస్థలను స్థాపించి, అస్సాం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టాడు. పలు ఆస్తుల్ని కూడబెట్టాడు. ఈ కుంభకోణంలో బోరా దంపతులతో పాటు మరికొందరిపైనా ఆరోపణలు వచ్చాయి. అతడి అరెస్టు తర్వాతే వీరిని పోలీసులు విచారణకు పిలిచారు. అయితే వీరు హాజరుకాకపోవడంతో లుకౌట్ నోటీసులు జారీ చేసి, తాజాగా అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సదరు నటి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "పరువుకు నష్టం కలిగించేలా నా కుటుంబంపై వార్తలు వస్తోన్న నేపథ్యంలో నేను పోలీసుల ముందు లొంగిపోవాలని, విచారణకు సహకరించాలని నిర్ణయించుకున్నాను. నేను ఎక్కడికీ పారిపోలేదు. మీడియాలో వస్తోన్న కథనాలతో మాకు ఎదురైన వేధింపుల వల్ల మేం పబ్లిక్‌కు దూరంగా ఉన్నాం. ఆ వార్తల్లో 10 శాతం కూడా వాస్తవం లేదు" అని వెల్లడించారు. ఆమె లొంగిపోతానని చెప్పిన మరుసటి రోజే..పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. తొలుత మీడియా కథనాల్లో ఈ స్కామ్ విలువ రూ.22 వేల కోట్లు అని రాగా.. తర్వాత ఆ మొత్తం రూ. 2వేల కోట్లుగా పేర్కొన్నాయి.



# కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అరెకపూడి ఇంటికి వెళ్లి భారాస కండువా కప్పుతానని కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు.

దాన్ని స్వీకరిస్తున్నట్లు అరెకపూడి గాంధీ తెలిపారు. తన ఇంటికి కౌశిక్‌రెడ్డి రాకపోతే.. తానే ఆయన ఇంటికి వెళతానని వ్యాఖ్యానించారు. అరెకపూడి తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. అనంతరం తన అనుచరులతో కలిసి కౌశిక్‌రెడ్డి నివాసానికి బయల్దేరి వెళ్లారు.

**కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు :** "మీ ఇంటికొస్తా.. జెండా ఎగరేస్తా అంటే మేం ఖాళీగా ఉన్నామా? కేసీఆర్ లాంటి పెద్ద మనుషులు అలాంటి వ్యాఖ్యలు చేస్తే స్వాగతించేవాడిని. నాతోటి శాసనసభ మిత్రులు అడిగినా బదులిచ్చేవాడిని. ఎన్నికల్లో గెలిపించకపోతే చనిపోతా అని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. శేరిలింగంపల్లి నుంచి ప్రజలు నన్ను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు.. వారికి సమాధానమిస్తా. అంతేకానీ.. కౌశిక్‌రెడ్డికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదు. నేనే మీ ఇంటికొస్తా.. తట్టుకునే దమ్ముందా?" అని అరెకపూడి గాంధీ సవాల్ విసిరారు. మరోవైపు అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి నివాసాల వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌశిక్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కొండాపూర్‌లోని ఆయన నివాసం నుంచి బయటకు రాకుండా పోలీసులు మోహరించారు. అరెకపూడి గాంధీని ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా నియమిస్తూ ఇటీవల శాసన సభాపతి నిర్ణయం తీసుకున్నారు. తమ పార్టీ తరఫున గెలిచి ఫిరాయించిన ఎమ్మెల్యేకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇవ్వడంపై భారాస నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

ఈ క్రమంలోనే అరెకపూడి ఇంటికి వెళ్తానని కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. దీంతో అరెకపూడి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## చైనాలో
# ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అదృశ్యం..!

చైనాలో ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను నియంత్రించేందుకు జిన్‌పింగ్ సర్కారు సిద్ధమైంది. తాజాగా ముగ్గురు ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను బీజింగ్ అధికారులు ఆగస్టులో బంధించినట్లు బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈ వార్త ఆ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ముగ్గురిలో ప్రభుత్వ రంగానికి చెందిన హైటాంగ్ సెక్యూరిటీస్‌కు చెందిన ఓ బ్యాంకర్ దేశం నుంచి పారిపోగా.. అతడిని విదేశాల్లో అరెస్టు చేసి చైనాకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. గతేడాది చైనాలో ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ బావో ఫాన్ అదృశ్యం కలకలం రేపింది. అతడిని ఓ కేసు దర్యాప్తు నిమిత్తం అప్పట్లో అదుపులోకి తీసుకొన్నారు. తాజాగా అధికారులు బంధించిన వారిలో షెన్‌వాన్ హాంగ్‌యూవాన్ గ్రూప్ జనరల్ మేనేజర్ వాంగ్‌ఝోపింగ్, గ్యూవాన్ సెక్యూరిటీస్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ విభాగం అధిపతి వాంగ్ చెన్ ఉన్నారు. హైటాంగ్ సెక్యూరిటీస్ సహా పలు బ్రోకరేజీ సంస్థలు తమ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను పాస్‌పోర్టులు అప్పజెప్పాలని కోరినట్లు తెలుస్తోంది. ఇక వ్యక్తిగత, వృత్తిపరమైన విదేశీ పర్యటనలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వెల్లడించాయి. చివరికి ఉద్యోగం రాజీనామాకు కూడా అనుమతి అవసరమని పేర్కొన్నాయి. ఇక ఈ బ్యాంకర్లకు విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చినా.. ఆయా సంస్థల సహోద్యోగి వీరితోపాటు ఉంటారు. ముందుగా నిర్ణయించిన ప్రదేశాల్లోనే వీరు తమ కార్యకలాపాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. చైనా నియంత్రణ సంస్థల నుంచి ఆయా కంపెనీలకు ప్రైవేటుగా వచ్చిన ఆదేశాల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకొన్నారు. ప్రభుత్వం ఆయా సంస్థల ఐపీవోలు, నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలిస్తోందని.. అవసరమైతే ఆ బ్యాంకర్లను ప్రశ్నించేందుకు పిలుస్తారని కొన్ని సంస్థలు చెబుతున్నాయి. గతంలో ప్రభుత్వరంగ కంపెనీల్లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, కమ్యూనిస్టు పార్టీ అధికారులు మాత్రమే పాస్‌పోర్టును ఇలా సమర్పించేవారు. చైనాలో బ్రోకరేజీ పరిశ్రమ, దేశీయ మార్కెట్ కార్యకలాపాల విలువ 1.7 ట్రిలియన్ డాలర్లుగా అంచనా. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫైనాన్షియల్ రంగంలో పనిచేసే ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయని బీజింగ్‌లోని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ ఛాన్సన్ అండ్ కో పేర్కొన్నారు. ప్రస్తుతం 147 ప్రముఖ బ్రోకరేజీ సంస్థల్లో 8,700 మంది ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లున్నారు. వీరు ఐపీవోలు, షేర్ల విక్రయాలు వంటి కార్యకలాపాలను నిర్వహిస్తారు.

# కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి: హరీశ్‌రావు



హైదరాబాద్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగిందని, ఈ ఘటనను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఇదేం ప్రజాస్వామ్యం.. ఇదేం ప్రజాపాలన.. ఇదేం ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు.

"మా పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుని మాపైనే దాడి చేయించడం దుర్మార్గం. భారాస ఎమ్మెల్యేలపై దాడులు చేయించడం హేయమైన చర్య. కాంగ్రెస్ విద్రోహ, వికృత, అప్రజాస్వామిక వైఖరిని ఖండిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో జరిగిన దాడి ఇది. సీఎం వెంటనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలి. దాడిని నిలువరించడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ విఫలమైంది. కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రాహుల్ వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకే భారాస, కాంగ్రెస్‌ల కొత్త నాటకం : కేంద్రమంత్రి



సికింద్రాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకే భారాస, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్త నాటకానికి తెరలేపారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం సాఫీగా సాగుతుందని చెప్పారు. రాంగోపాల్‌పేట్‌లోని పలు వ్యాపార సముదాయాల్లో తిరుగుతూ స్థానికులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతు దేశద్రోహ, సంఘవిద్రోహ శక్తులైన ఉగ్రవాద సంస్థలు.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సమర్థించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాద సంస్థలకు, రాహుల్ గాంధీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ ఇటాలియన్ కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లాలన్నారు . ఆరు గ్యారంటీల నుంచి దృష్టి మళ్లించేందుకే హైడ్రా పేరుతో కొత్త నాటకానికి తెర లేపారని అన్నారు. పేద ప్రజల విషయంలో హైడ్రా వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని, అప్పట్లో అనుమతులు ఇచ్చిన అధికారులు, ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలన్నారు.

# ఖమ్మంలో కేంద్ర బృందం పర్యటన



ఖమ్మం, సెప్టెంబర్ 12: ఖమ్మం నగరంలో కేంద్ర బృందం గురువారం పర్యటిస్తోంది. బొక్కల గడ్డ, జలగం నగర్, మోతీ నగర్, ప్రకాష్ నగర్, దంసలాపురం ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటించింది. మున్నేరు వరద కారణంగా నష్టపోయిన ఇళ్లను బృందం సభ్యులు పరిశీలించారు. రెండు బృందాలుగా మున్నేరు వరద ప్రాంతాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. నష్టపోయిన వరద బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది. జలగం నగర్ నుంచి కోదాడ కేంద్ర బృందం బయలుదేరింది. కేంద్ర బృందానికి వరదనష్టం వివరాలను జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో మున్నేరు వరద బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాదాపు పదిరోజుల పాటు జిల్లా ప్రజలను మున్నేరు వణికించింది. గ్రామాలకు గ్రామాలు వరద నీటిలోని ఉండిపోయాయి. వెంటనే ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్నేరు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారికి ఆహారం, తాగునీరు, వైద్యసాయాన్ని అందించారు. వరద ముంపు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్ష నేతలు పర్యటించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అయితే వరద ముంపు తగ్గాక ఇంటికి వెళ్లిన బాధితులు అక్కడ పరిస్థితి చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. వరద ధాటికి కొట్టుకుపోయిన ఇళ్లను చూసి రోదించారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు దయనీయ స్థితిలో ఉన్నారు.


వేలాది మంది ప్రజలు సర్వం కోల్పోయి నడి వీధిలో నిలబడ్డారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మున్నేరు వరద ముంపు బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలంగాణలో ఉపఎన్నికలపై టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: తెలంగాణలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయని టీపీసీసీ చీఫ్ తేల్చిచెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేను మహేష్ కుమార్ కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 60 ఏళ్ళు రాజకీయాల్లో ఉన్న మహానాయకుడు ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని.. ఖర్గేను కలిసి ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలని ఖర్గే సూచన చేశారన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకులను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన స్థానాలకంటే ఎక్కువ సాధించి మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నామన్నారు. మంత్రివర్గ విస్తరణ గురించి సీఎం, ఏఐసీసీ పెద్దలు మాట్లాడారని.. వారే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటు అయ్యేంత వరకు పాత కమిటీలు పనిచేస్తాయన్నారు. బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతానని చెప్పారు. ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చారని.. సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు సమయం ఇచ్చిందని... మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేటీఆర్ సవాళ్ళను పట్టించుకునే స్థితిలో లేరని... ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్ధవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అలాగే అరికపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని.. సాంకేతికంగా ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# దేశాలతో ఐకమత్యంగా ముందుకుసాగడమే భారత్ లక్ష్యం: రాజ్‌నాథ్ సింగ్



జైపూర్: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరుగుతున్న భారత వాయుసేన విన్యాసాలను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వీక్షించారు. అనంతరం వివిధ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలపై ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని అన్ని దేశాలు తమ భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మెరుగుపరచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం అనేక దేశాలు యుద్ధాల్లో మునిగితేలుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో వాటన్నింటితో ఐకమత్యంగా ముందుకుసాగడమే భారత్ ముందున్న లక్ష్యమని ఆయన వివరించారు. తేలికపాటి యుద్ధ విమానాలు, సెన్సార్లు, రాడర్ల తయారీ రంగాల్లో భారత్ ఎక్కువ స్వావలంబనను సాధిస్తోందన్నారు. ఇక, గతంలో ఇతర దేశాల నుంచి ఆయుధాలు, పరికరాల పరంగా దిగుమతి చేసుకొనే దేశంగా మాత్రమే భారత్ కనిపించేదన్నారు. ప్రస్తుతం భారత్ దాదాపు 90 దేశాలకు పైగా ఆయుధాలు, పరికరాలను ఎగుమతి చేస్తోందని తెలిపారు. ఇక, ఈ తారంగ్ శక్తి విన్యాసాల్లో అమెరికా, ఆస్ట్రేలియా, గ్రీస్ విమానాలు సైతం పాల్గొంటున్నాయి. ఈ విన్యాసాలు ఆగస్టు 30న ప్రారంభం కాగా ఈనెల 14 వరకు కొనసాగుతాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com